తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక
వరంగల్ | గురువారం-25-సెప్టెంబర్-2025 | సంపుటి:3 | సంచిక:120 | పేజీలు:8 | వెల: రూ.5 | www.telanganamuchatlu.in



# సామాజిక తెలంగాణ కోసం పని చేసేవారిని ఆహ్వానిస్తున్నా..

- రాష్ట్ర సాధన కోసం అందరం కలిసి పని చేసి విజయం సాధించాం
- తదుపరి లక్ష్యం సామాజిక తెలంగాణ కోసం అందరం కలిసి సాగుదామని పిలుపు
- జాగృతిలో చేరే కొత్తవారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామని హామీ
- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కవిత

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

సామాజిక తెలంగాణ కోసం పని చేసేవారిని ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పేర్కొన్నారు. ఈరోజు ఆమె మాట్లాడుతూ, తెలంగాణ రాష్ట్రాన్ని సాధించేందుకు మనమందరం ఐక్యంగా పోరాడి విజయం సాధించామని గుర్తు చేశారు. తదుపరి లక్ష్యమైన సామాజిక తెలంగాణను సాధించే దిశగా మనమందరం కలిసి ముందుకు సాగుదామని ఆమె పిలుపునిచ్చారు. ఆత్మగౌరవంతో కూడిన తెలంగాణ కోసం పాటుపడదామని కవిత అన్నారు. పునరేకీకరణ కోసం ఐక్యంగా పోరాటం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడి తాము పోరాడుతామని ఆమె స్పష్టం చేశారు.

మిగతా 2లో..

# రేవంత్ సర్కార్ అదిరిపోయే నిర్ణయం

- ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రేవంత్ సర్కార్ అడుగులు
- దేశంలోనే అత్యుత్తమ ప్రమాద, ఆరోగ్య బీమా అందించేందుకు కసరత్తు
- సింగరేణిలో ఉద్యోగులు, కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి రూ. 1 కోటి బీమా

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)





ఉద్యోగులకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. ఉద్యోగుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే దిశగా రేవంత్ సర్కార్ అడుగులు వేస్తోంది. దేశంలోనే అత్యుత్తమ ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలను ఉద్యోగులకు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ పథకంలో భాగంగా ఉద్యోగులకు రూ. 1.25 కోట్ల నుంచి రూ. 1.50 కోట్ల వరకు ప్రమాద బీమా సౌకర్యం కల్పించే అంశంపై రాష్ట్ర ఆర్థిక శాఖ వివిధ బ్యాంకులతో చర్చలు జరుపుతోంది. ఈ వినూత్న పథకానికి సింగరేణి సంస్థ ప్రేరణ అని చెప్పొచ్చు. సింగరేణిలో ఉద్యోగులు, కార్మికులు ప్రమాదంలో మరణిస్తే వారి కుటుంబానికి రూ. 1 కోటి బీమా లభిస్తుంది. ఈ పథకం స్ఫూర్తితోనే ఇప్పుడు ప్రభుత్వం కూడా రాష్ట్ర ఉద్యోగులకు మరింత మెరుగైన బీమా సదుపాయాలను కల్పించేందుకు సిద్ధమవుతోంది. సింగరేణి స్ఫూర్తితోనే కేంద్ర బొగ్గు శాఖ కూడా కోల్ ఇండియాలో ఇలాంటి పథకాన్ని అమలు చేసేందుకు సిద్ధమైంది. ప్రస్తుతం ఎస్‌బీఐలో శాలరీ అకౌంట్ ఉన్న కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ప్రమాద మరణం సంభవిస్తే రూ. 1 కోటి బీమా లభిస్తుంది. విమాన ప్రమాదంలో మరణిస్తే రూ. 1.60 కోట్లు, రూపే డెబిట్ కార్డు ఉంటే అదనంగా మరో రూ. 1 కోటి చెల్లిస్తారు.


మిగతా 2లో..

# గ్రూప్1పై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

గ్రూప్1 మెయిన్స్ పరీక్ష పేపర్లను తిరిగి మూల్యాంకనం చేయాలని లేనిపక్షంలో తిరిగి పరీక్షలను నిర్వహించాలంటూ సింగిల్ జడ్జి వెలువరించిన తీర్పును సవాల్ చేస్తూ దాఖలైన అప్పీళ్లపై బుధవారం హైకోర్టు విచారణ చేపట్టింది. సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే విధించింది. విచారణను వచ్చే నెల 15వ తేదీకి వాయిదా వేసింది హైకోర్టు డివిజన్ బెంచ్.

మిగతా 2లో..




# మోదీ, చంద్రబాబు చెప్పినట్లు రేవంత్ రెడ్డి ఆడుతున్నాడు..



- మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేస్తున్నారు
- రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమో ప్రజలు కూడా ప్రశ్నించలేదు
- అవినీతి జరిగి ఉంటే బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, సొరంగాలు ఎవరు కట్టారు
- రేవంత్ రెడ్డిపై కేటీఆర్ ఆగ్రహం

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నుంచి 8 మంది చొప్పున ఎంపీలు గెలిచినా తెలంగాణకు వచ్చింది గుండు సున్నా అని కేటీఆర్ అన్నారు. పకోడీలు అమ్మడాన్ని కూడా ఉద్యోగంగా చెప్పుకోవడం బీజేపీ నేతల మూర్ఖత్వమని విమర్శించారు. శ్రీరాముడు కూడా బీజేపీ మోసాన్ని గ్రహించి అయోధ్యలో ఆ పార్టీని ఓడిరచారని అన్నారు. మోదీ, చంద్రబాబు ఆడిస్తున్నట్లు కోవర్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆడుతున్నారని విమర్శించారు. చంద్రబాబు ప్రయోజనాల కోసమే మేడిగడ్డ బ్యారేజీకి మరమ్మతులు చేయించకుండా కాలయాపన చేస్తున్నారని కేటీఆర్ అన్నారు. కర్ణాటకలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆల్మట్టి ఎత్తు 5 మీటర్లు పెంచడానికి రూ.70 వేల కోట్లు ఖర్చు పెడుతుంటే తప్పులేదు గానీ, కేసీఆర్ 40 లక్షల ఎకరాలకు నీళ్లిచ్చే కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.93 వేల కోట్లు ఖర్చు చేస్తే లక్ష కోట్ల అవినీతి జరిగిందని అబద్ధాలు ప్రచారం చేశారని మండిపడ్డారు.

మిగతా 2లో..

# ఇంటింటికీ మోదీ తీసుకొచ్చిన కార్యక్రమాలను తెలియజేయండి

- స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీకి పట్టంకట్టేలా కార్యకర్తలు పని చేయాలని సూచన
- స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజార్టీ స్థానాలు సాధిస్తామని ధీమా
- జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో విజయం సాధిస్తామన్న రామచందర్ రావు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



నాయకులు, కార్యకర్తలు హైదరాబాద్‌ను వీడి, ప్రతి ఇంటికి వెళ్లి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రవేశపెట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు తెలియజేయాలని తెలంగాణ బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు పిలుపునిచ్చారు. రాష్ట్ర పదాధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు బీజేపీకి పట్టం కట్టేలా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతి గ్రామానికి వెళ్లి ప్రచారం చేయాలని ఆయన సూచించారు.

మిగతా 2లో..

# కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ పార్టీ పూట పూటకో మాట

- ఘడియ ఘడియకో కాంగ్రెస్ లెక్క..
- 299 టీఎంసీ కృష్ణా జలాల్లో వాటా ఒప్పుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీ
- చంద్రబాబుకు భయపడి బనకచర్లపై మౌనం వహించారు
- రేవంత్ రెడ్డికి పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువా?
- హరీశ్‌రావు

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)



కాంగ్రెస్ ప్రభుత్వంపై మాజీ మంత్రి హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. హంతకుడే సంతాప సభ పెట్టినట్లు ఉంది కాంగ్రెస్ పార్టీ తీరు అని హరీశ్‌రావు విమర్శించారు. కృష్ణా జలాల వాటపై సీఎం రేవంత్ రెడ్డి ఒక మాట, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మరో మాట మాట్లాడుతున్నారని హరీశ్‌రావు మండిపడ్డారు. కృష్ణా జలాల విషయంలో పూట పూటకో మాట, ఘడియ ఘడియకో లెక్క ఉందన్నారు. 299 టీఎంసీ కృష్ణా జలాల్లో వాటా ఒప్పుకొని తెలంగాణకు ద్రోహం చేసింది కాంగ్రెస్ పార్టీనే.

మిగతా 2లో..

# బీహార్‌లో 'సీమాంచల్ న్యాయ యాత్ర' ప్రారంభించిన అసదుద్దీన్ ఒవైసీ

- యాత్ర ద్వారా ఎన్నిక ప్రచారాన్ని ప్రారంభించిన అసదుద్దీన్
- మహాఘట్‌బంధన్‌లో చేరడానికి సిద్ధమని తెలిపిన హైదరాబాద్ ఎంపీ
- కూటమిలో చేరితో తమకు ఆరు సీట్లు ఇవ్వాలని డిమాండ్

(హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు)

మహాఘట్‌బంధన్‌లో చేరడానికి తాను సిద్ధంగా ఉన్నానని మజ్లిస్ పార్టీ అధ్యక్షుడు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ స్పష్టం చేశారు. బీహార్‌లో జరగనున్న అసెంబ్లీ ఎన్నికల కోసం ఆయన 'సీమాంచల్ న్యాయ యాత్ర' ద్వారా తన ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మహాఘట్‌బంధన్‌లో చేరడానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. తమకు ఆరు సీట్లు కేటాయించాలని ఆయన డిమాండ్ చేశారు. ఆయన తన యాత్రను కిషన్‌గంజ్‌లో ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, తాము కలిసి పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని ప్రతిపక్ష నాయకుడు తేజస్వి యాదవ్ దృష్టికి తీసుకువచ్చినట్లు తెలిపారు.



మిగతా 2లో..

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# రేవంత్ సర్కార్ అదిరిపోయే నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

అలాగే శాశ్వత వైకల్యానికి రూ. 1 కోటి, సహజ మరణానికి రూ. 10 లక్షల బీమా అందుతుంది. ఈ క్రమంలో రాష్ట్ర ఉద్యోగులకు కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కంటే మెరుగైన ప్రయోజనాలు అందించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా మాట్లాడుతూ.. కొన్ని బ్యాంకులు ఇప్పటికే అనేక రాయితీలు ఇచ్చేందుకు అంగీకరించాయని.. ఇంకా ఎక్కువ బీమా కల్పించేందుకు చర్చలు కొనసాగిస్తున్నామని తెలిపారు. ఈ పథకం అమలైతే తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగుల కుటుంబాలకు ఒక పెద్ద ఆర్థిక భరోసా దక్కనుంది. ప్రమాద బీమాతో పాటు గరిష్ఠంగా రూ. 30 లక్షల




వరకు ఆరోగ్య బీమా కల్పించేందుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తోంది. దీనికోసం ఉద్యోగులు నెలకు సుమారు రూ. 2,495 ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఈ పథకంలో సంవత్సరానికి ఒకసారి ఉచిత ఆరోగ్య పరీక్షల సదుపాయం కూడా ఉంటుంది. ఈ పథకం అమలులోకి వస్తే దేశంలోనే అత్యుత్తమ ప్రమాద, ఆరోగ్య బీమా సౌకర్యాలు కలిగిన ప్రభుత్వ ఉద్యోగులుగా తెలంగాణ ఉద్యోగులు నిలుస్తారు.

## మోదీ, చంద్రబాబు చెప్పినట్లు రేవంత్ రెడ్డి ఆడుతున్నాడు..

(మొదటి పేజీ తరువాయి)

రూ.93 వేల కోట్ల ప్రాజెక్టులో లక్ష కోట్ల అవినీతి ఎలా సాధ్యమో ప్రజలు కూడా ప్రశ్నించలేదని అన్నారు. అవినీతి జరిగి ఉంటే బ్యారేజీలు, పంప్‌హౌస్‌లు, సొరంగాలు ఎవరు కట్టారని ప్రశ్నించారు. దేశంలో ఏ ముఖ్యమంత్రీ చేయనంతగా కేసీఆర్ తెలంగాణను అభివృద్ధి చేశారని కేటీఆర్ అన్నారు. కానీ, పదేళ్లలో మనం చేసిన పనులను ప్రజలకు సరిగ్గా చెప్పుకోలేకపోయామని తెలిపారు. 'మోసపోతే గోసపడతాం' అని కేసీఆర్ ముందే హెచ్చరించారని.. ఆయన చెప్పినట్లే ఇవాళ రాష్ట్రంలో దారుణ పరిస్థితులు ఉన్నాయని తెలిపారు. ఎమ్మెల్యే ఓడిపోయినా ఫర్వాలేదు, కేసీఆర్ గెలిస్తే చాలని ప్రజలు భావించడం వల్లే మనకు ప్రతికూల ఫలితాలు వచ్చాయని అన్నారు. కేసీఆర్ ఉన్నప్పుడు కరెంటు, నీళ్లు, యూరియా ఎలా వచ్చాయి? కాంగ్రెస్ రాగానే ఎందుకు కరువయ్యాయని ప్రశ్నించారు. రేవంత్ రెడ్డికి సత్తా లేకపోవడమే ఇందుకు కారణమని అన్నారు. కరోనా కష్టకాలంలోనూ సంక్షేమ పథకాలు కేసీఆర్ ఆపలేదని గుర్తుచేశారు. తలసరి ఆదాయంలో దేశంలోనే నంబర్ వన్‌గా నిలిపిన రాష్ట్రాన్ని 'క్యాన్సర్ పేషెంట్' అంటూ రేవంత్ పరువు తీస్తున్నాడని మండిపడ్డారు. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా కేసీఆర్‌ను తిరిగి ముఖ్యమంత్రిని చేసేందుకు తెలంగాణ ప్రజలు సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. కరీంనగర్ ప్రజలు మరోసారి చైతన్యవంతమైన తీర్పు ఇవ్వాలని కోరారు.

## సామాజిక తెలంగాణ కోసం పని చేసేవారిని ఆహ్వానిస్తున్నా..

(మొదటి పేజీ తరువాయి)

సామాజిక తెలంగాణ కోసం పనిచేస్తామని ముందుకు వచ్చిన రంగారెడ్డి జిల్లావాసులను ఆమె సాదరంగా ఆహ్వానించారు.
జాగృతిలో ఇదివరకే ఉన్న నాయకత్వంతో పాటు, కొత్తగా చేరుతున్న వారికి కూడా సముచిత స్థానం కల్పిస్తామని ఆమె హామీ ఇచ్చారు. కుత్బుల్లాపూర్ ప్రాంతంతో సహా నగరంలోని హైడ్రా బాధితులైన పేదల తరఫున తాము పోరాడుతామని ఆమె తెలిపారు. భవిష్యత్తులో కూడా పేద ప్రజల కోసం తమ పోరాటం కొనసాగుతుందని కవిత స్పష్టం చేశారు.

# కృష్ణా జలాల విషయంలో కాంగ్రెస్ పార్టీ పూట పూటకో మాట

(మొదటి పేజీ తరువాయి)

చారిత్రక తప్పిదం చేసింది మీరు, తెలంగాణ సాగు నీటి రంగం చరిత్రలో ద్రోహులు మీరు. సమ్మక్క సాగర్ పూర్తి చేసింది బీఆర్ఎస్, డబ్బా ప్రచారం చేసుకుంటున్నది కాంగ్రెస్. ఒకవైపు చంద్రబాబుకు భయపడి బనకచర్లపై మౌనం వహించారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ ఉందని ఆలమట్టి ఎత్తుపై మౌనం వహిస్తున్నారు. రేవంత్ రెడ్డికి సొంత రాష్ట్ర ప్రయోజనాల కంటే, పక్క రాష్ట్ర ప్రయోజనలే ఎక్కువా? కృష్ణా జలాల్లో వాటా విషయంలో నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్ రెడ్డి మల్లా పాత పాటే పాడిరడు. ఉత్తర కుమార ప్రగల్భాలే పలికిండు. బేసిన్ల గురించి బేసిక్స్ తెల్వదు, నీళ్ల వాటా గురించి నీళ్లు నములుతారు. కనీస అవగాహన లేని, తెలంగాణ సోయి లేని ఇట్లాంటి దద్దమ్మలు మనకు ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి కావడం మన దౌర్భాగ్యం. ఉత్తం కుమార్ రెడ్డి నిన్న ఏం మాట్లాడిరడు.. కృష్ణా జలాల్లో 763 టీఎంసీలు ఇవ్వాలని డిమాండ్ చేసినం అని గొప్పగ చెప్పిండు. రైట్ షేర్ కోసం నేనే స్వయంగా ట్రిబ్యునల్ ముందు అటెండ్ అయినట్లు చెప్పుకున్నడు అని హరీశ్‌రావు గుర్తు చేశారు. మరి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 18.06.2025 నాడు ఏమన్నడు కృష్ణా బేసిన్ మీద 500 టిఎంసీలకు బ్లాంకెట్ ఎన్వోసీ ఇవ్వండి, ఆ తర్వాత ఏ ప్రాజెక్టులైన కట్టుకోండి అన్నడు. మొన్న సెప్టెంబర్ 13న జరిగిన నీటి పారుదల శాఖ సమీక్షలో ఇదే ముఖ్యమంత్రి ఏమంటడు.. కృష్ణా జలాల్లో 904 టీఎంసీల వాటా సాధించి తీరాలె అంటడు. ఉత్తం ఏమో 763 టిఎంసీల రైట్ షేర్ అంటడు, ముఖ్యమంత్రి ఏమో ఓ సారి 500 టీఎంసీ అంటడు. ఓసారి 904 టీఎంసీలు అంటడు. పూటకో మాట మాట్లాడి పరువు తీసుకుంటున్నరు. వీళ్ల అజ్ఞానం వల్ల తెలంగాణ రాష్ట్రం హక్కుగా రావాల్సిన నీటి వాటాను కోల్పోయే పరిస్థితి ఉంది. ముఖ్యమంత్రి చెప్పింది కరెక్టా? లేదా నీళ్ల మంత్రి చెప్పింది కరెక్టా? అసలు ఎవరిది కరెక్టు? కనీస అవగాహన లేకుండా ఎట్ల మాట్లాడుతున్నరు. కనీసం ప్రిపరేషన్ లేకుండా ఇలా ఎన్నాళ్లు ఉంటారు అని హరీశ్‌రావు నిలదీశారు.

## గ్రూప్1పై సింగిల్ బెంచ్ ఇచ్చిన తీర్పుపై డివిజన్ బెంచ్ స్టే

(మొదటి పేజీ తరువాయి)

గ్రూప్1 మెయిన్స్ పరీక్షలో 719 మంది అభ్యర్థులు ఒకే రకమైన మారులు సాధించడం, అభ్యర్థుల సంఖ్యలో వ్యత్యాసంపై టీజీపీఎస్సీ ఇచ్చిన వివరణను సింగిల్ జడ్జి పరిగణనలోకి తీసుకోలేదని, కోఠి మహిళా కాలేజీలో పరీక్ష రాసిన అభ్యర్థుల్లో 14.8% మంది టాప్500 మందిలో ఉన్నారనేందుకు ఆధారాలు లేవని పిటిషన్‌లో పేర్కొన్నారు. భువనగిరి మండలం నందనం గ్రామానికి చెందిన పరమేశ్ మట్టా, మరో 221 మంది అభ్యర్థులను ప్రతివాదులుగా చేర్చిన ఈ పిటిషన్‌పై హైకోర్టు డివిజన్ బెంచ్ విచారణ చేపట్టింది.



## బీహార్‌లో 'సీమాంచల్ న్యాయ యాత్ర' ప్రారంభించిన అసదుద్దీన్ ఒవైసీ

(మొదటి పేజీ తరువాయి)

ఈ మేరకు బీహార్ రాష్ట్ర మజ్లిస్ పార్టీ నేత అఖ్తరుల్ ఇమాన్ ప్రతిపక్ష నాయకుడికి లేఖ రాశారని వెల్లడిరచారు. మహాఘట్‌బంధన్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని మీడియా ద్వారా కూడా స్పష్టం చేస్తున్నామని ఆయన అన్నారు. తమకు ఆరు సీట్లు కేటాయించాలని అఖ్తరుల్ కోరారని తెలిపారు. ఇప్పుడు నిర్ణయం మహాఘట్‌బంధన్ చేతిలోనే ఉందని అసదుద్దీన్ అన్నారు. తమ ప్రతిపాదనను వారు అంగీకరించని పక్షంలో బీజేపీని ఎవరు గెలిపించాలనుకుంటున్నరో ప్రజలకు అవగతమవుతుందని అభిప్రాయపడ్డారు. అంతిమ నిర్ణయం బీహార్ ప్రజలదేనని ఆయన అన్నారు. భవిష్యత్తులో తమను ఎవరూ నిందించకుండా, బీజేపీని ఓడిరచేందుకు ప్రతిపక్ష కూటమితో కలిసి పని చేయడానికి సిద్ధంగా ఉన్నామని ఆయన తేల్చి చెప్పారు.

# ఇంటింటికీ మోదీ తీసుకొచ్చిన కార్యక్రమాలను తెలియజేయండి

(మొదటి పేజీ తరువాయి)

స్థానిక ఎన్నికల్లో బీజేపీ మెజారిటీ స్థానాలు గెలుస్తుందనే నమ్మకం తనకు ఉందని ఆయన అన్నారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో బీజేపీ విజయం సాధించబోతోందని ఆయన జోస్యం చెప్పారు. ఎవరెన్ని అడ్డంకులు సృష్టించినా, ఎన్ని కుట్రలు చేసినా రాష్ట్రంలో బీజేపీ ప్రభుత్వ ఏర్పడటం తథ్యమని ధీమా వ్యక్తం చేశారు. తెలంగాణలో కాషాయ జెండా ఎగరడం ఖాయమని అన్నారు. కార్యకర్తగా 40 ఏళ్లుగా బీజేపీలో కొనసాగినందుకు ఆయన సంతోషం వ్యక్తం చేశారు. బీజేపీ కృషి వల్లే తెలంగాణ బిల్లు పార్లమెంటులో ఆమోదం పొందిందని ఆయన అన్నారు. బీఆర్ఎస్ పాలనలో కేసీఆర్ మాటలతో పదేళ్లుగా తెలంగాణ ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేసే పరిస్థితిలో లేదని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు అధికారంలో ఉండి విద్యావ్యవస్థను నిర్వీర్యం చేశాయని ఆరోపించారు. కేవలం 600 గ్రూప్1 పోస్టులను కూడా భర్తీ చేయలేని దుస్థితిలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని దుయ్యబట్టారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వం జీవో ఇచ్చి స్థానిక ఎన్నికలకు వెళ్లాలని ఆయన డిమాండ్ చేశారు. జీఎస్టీ తగ్గింపును దేశ ప్రజలు స్వాగతిస్తున్నారని, దీనివల్ల అన్ని సామాజిక వర్గాల ప్రజలు లబ్ధి పొందుతారని రామచందర్ రావు అన్నారు. జీఎస్టీ తగ్గింపు నిర్ణయాన్ని కాంగ్రెస్ జీర్ణించుకోలేకపోతోందని విమర్శించారు. ఖరీఫ్ సీజన్ ముగిసేలోపు రైతులకు పూర్తిస్థాయిలో యూరియా అందుబాటులో ఉంటుందని హామీ ఇచ్చారు. యూరియా బ్లాక్ మార్కెట్ దందాను అరికట్టడంలో రాష్ట్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని ఆయన ఆరోపించారు.

## సొంత కూతురుని కిడ్నాప్ చేసిన తల్లిదండ్రులు

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:** నగర శివారులోని కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. ఓ జంట తమ కూతురిని కిడ్నాప్ చేసింది. ఈ ఘటన ఇప్పుడు సంచలనం రేపుతోంది. మరి వారు తమ కూతురుని ఎందుకు కిడ్నాప్ చేశారు..? పూర్తి వివరాలు ఈ కథనంలో తెలుసుకుందాం. బుధవారం ఉదయం కీసర పోలీస్ స్టేషన్ పరిధిలోని నర్సంపల్లి గ్రామంలో కిడ్నాప్ వ్యవహారం కలకలం రేపింది. తల్లిదండ్రులు తమ కన్న కూతురుని కిడ్నాప్ చేసి తీసుకెళ్లారు. ఇందుకు కారణం ప్రేమ వివాహమేనని తెలుస్తోంది. నర్సంపల్లి గ్రామానికి చెందిన ప్రవీణ్, ఓ యువతి ప్రేమించుకున్నారు. వీరి వివాహానికి యువతి తల్లిదండ్రులు అంగీకరించలేదు. ప్రేమ వివాహాన్ని తీవ్రంగా వ్యతిరేకించారు. అయినప్పటికీ.. ప్రవీణ్, యువతి ఇంటి నుంచి వెళ్లిపోయి ప్రేమ వివాహం చేసుకున్నారు. ఈ క్రమంలోనే వివాదం కొనసాగుతోంది. నాలుగు నెలలుగా ఈ వ్యవహారం కొనసాగుతుండగా.. బుధవారం నాడు షాకింగ్ ఘటన చోటు చేసుకుంది. యువతి తల్లిదండ్రులు తమ బంధువులతో కలిసి బుధవారం తెల్లవారుజామునే ప్రవీణ్ ఇంటికి వెళ్లారు. ప్రవీణ్‌పై అతని కుటుంబ సభ్యులపై దాడి చేశారు. అనంతరం కారంపొడి చల్లి, కళ్లకు బట్టలు కట్టి యువతిని ఎత్తుకెళ్లారు ఆమె తల్లిదండ్రులు. ఈ ఘటన స్థానికంగా పెను సంచలనం సృష్టించింది. అయితే, అమ్మాయి భర్త ప్రవీణ్.. పోలీసులను ఆశ్రయించాడు. ఘటనపై ఫిర్యాదు చేశాడు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అమ్మాయి తల్లిదండ్రులపై కేసు నమోదు చేశారు. ఈ వ్యవహారంపై దర్యాప్తు చేస్తున్నారు.



## మేడారం అభివృద్ధి పనులపై వేగం పెంచిన ప్రభుత్వం

### అధికారులతో మంత్రులు సీతక్క, కొండ సురేఖ సమీక్ష

**హైదరాబాద్, తెలంగాణ ముచ్చట్లు:** మేడారం సమ్మక్కసారలమ్మ జాతరకు సంబంధించి చేపట్టిన మేడారం అభివృద్ధి పనులపై ప్రభుత్వం వేగం పెంచింది. సీఎం రేవంత్ రెడ్డి మంగళ వారం నాడు అధికారికంగా ప్రణాళికను ఖరారు చేయగా, అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని మంత్రులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, వరంగల్ జిల్లా ఇంచార్జ్ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచనలతో సచివాలయం నుంచి మంత్రి సీతక్క, వరంగల్ నుంచి మంత్రి కొండా సురేఖ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశానికి దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యార్, ఆర్ అండ్ బీ ఈఎన్సీ మోహన్ నాయక్, పంచాయతీ రాజ్ ఈఎన్సీ ఎన్. అశోక్, దేవాదాయ శాఖ ఇంజనీరింగ్ విభాగం అధికారులు హాజరయ్యారు. సమావేశంలో మంత్రులు మాట్లాడుతూ, "మేడారం అభివృద్ధి ప్రణాళిక సీఎం రేవంత్ రెడ్డి ఖరారు చేయడంతో కౌంట్‌డౌన్ ప్రారంభమైంది. ఇది ఒక మహాఘట్టం. ఈ చరిత్రాత్మక పనిలో మీరు అందరూ భాగమవుతున్నారు. ఈ కృషి శాశ్వతంగా నిలుస్తుంది అని పేర్కొన్నారు. మేడారం కీర్తి వెయ్యేళ్లు నిలిచేలా అభివృద్ధి పనులు ఉండాలని భక్తులకు ఏలాంటి ఇబ్బందులు లేకుండా పనులు చేపట్టాలని అని మంత్రులు స్పష్టం చేశారు. భక్తుల సౌకర్యాల కోసం మౌలిక వసతులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులు ఆదేశించారు. అలాగే మేడారం అభివృద్ధి ప్రణాళికలకు సంబంధించి వర్కింగ్ డ్రాయింగ్స్, స్ట్రక్చరల్ డిజైన్స్‌ను అత్యంత వేగంగా పూర్తి చేయాలని, తదనుగుణంగా పనుల అంచనాలను సిద్ధం చేసి టెండర్లు తక్షణమే పిలవాలని మంత్రులు ఆదేశించారు.

# ఈ నెల 30 వరకు భారీ వర్షాలు



తెలంగాణ రాష్ట్రంలో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశాలున్నాయని వాతావరణ శాఖ వెల్లడిరచింది. అల్పపీడనాల ప్రభావంతో రాష్ట్రంలో ఈ నెల 30 వరకు భారీ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం ప్రకటించింది. ప్రస్తుతం కొనసాగుతున్న అల్పపీడనం 12 గంటల్లో బలహీనపడే అవకాశం ఉందని తెలిపింది. రేపు పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో మరొక్క అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడిరచింది. ఈ నెల 26 నాటికి వాయుగుండంగా మారే అవకాశం ఉందని తదుపరి ఈ వాయుగుండం దక్షిణ ఒడిస్సా ఉత్తరాంధ్ర కోస్తా తీరం ప్రాంతంలో ఈ నెల 27న తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్లు ఒక ప్రకటనలో పేర్కొంది. ఇవాళ రేపు ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని.. ఎల్లుండి భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు తెలిపింది. ఇవాళ మంచిర్యాల నిర్మల్ నిజామాబాద్ జయశంకర్ భూపాలపల్లి ములుగు నల్గొండ సూర్యాపేట మహబూబాద్ వరంగల్ హనుమకొండ జనగాం జిల్లాలకు భారీ వర్షాలు కురుస్తాయని తెలిపింది. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలను జారీ చేసింది. రేపు ఆదిలాబాద్ కొమరం భీం ఆసిఫాబాద్ మంచిర్యాల నిర్మల్ నిజామాబాద్ పెద్దపల్లి జయశంకర్ భూపాలపల్లి ములుగు భద్రాద్రి కొత్తగూడెం మహబూబాద్ వరంగల్ హనుమకొండ జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున.. ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది. ఎల్లుండి నిర్మల్ నిజామాబాద్ వికారాబాద్ సంగారెడ్డి మెదక్ కామారెడ్డి మహబూబ్నగర్ జిల్లాలకు అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వెల్లడిరచింది. ఈ జిల్లాలకు ఆరెంజ్ హెచ్చరికలు జారీ చేసింది. ఉమ్మడి ఆదిలాబాద్ కరీంనగర్ వరంగల్ మహబూబ్నగర్ హైదరాబాద్ తోపాటు రంగారెడ్డి భద్రాద్రి కొత్తగూడెం సిద్దిపేట యాదాద్రి భువనగిరి జిల్లాల్లో భారీ వర్షం కురిసే అవకాశం ఉన్నందున ఈ జిల్లాలకు ఎల్లో హెచ్చరికలు జారీ చేసింది.

- రాష్ట్రంలో ఈ నెల 30 వరకు పలు జిల్లాల్లో భారీ వర్షా లు
- బంగాళాఖాతంలో ఏర్పడనున్న వాయుగుండం ప్రభావంతో అతిభారీ వర్షా లు కురిసే అవకాశం

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్ తెలుగు దిన పత్రిక
గురువారం-25- సెప్టెంబర్ 2025
వరంగల్




# ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయాలని వినతి పత్రం...

**బిఆర్ఎస్ నాయకులు మంకెన రమేష్**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 24,తెలంగాణ ముచ్చట్లు:** ఇటీవల అకాల వర్షాలతో చింతకాని మండలం నాగిలిగొండ గ్రామంలో నిరుపేద కుటుంబం అయిన చాట్ల మరియదాసు ఇల్లు పూర్తిగా దెబ్బ తినడం జరిగింది. మరియదాసు కి ఇల్లు లేకపోవడంతో వారిని బిఆర్ఎస్ నాయకులు కలిసి వారికి ధైర్యాన్ని ఇచ్చి వెంటనే చింతకాని తాసిల్దార్ కి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మంకెన రమేష్ మాట్లాడుతూ గ్రామాలలో పూర్తిస్థాయిలో ఎంక్వయిరీ చేసి ఎవరైతే అర్హులు ఉన్నారో ఇందిరమ్మ ఇళ్ళకి అర్హులను గుర్తించి వారికి ఇల్లు మంజూరు చేయాలని వారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ మండల కమిటీ నాయకులు గురీజాల హనుమంతరావు, వెంకటరామయ్య, చాట్ల సురేష్, చాట్ల భగవాన్ మరియు తదితరులు పాల్గొన్నారు.



# 12 ఏళ్ల నివాస సమస్యకు ముగింపు

**చిన్నారెడ్డి చోరవలో గుంటి బాలక్రిష్ణకు పట్టా!**

**వనపర్తి,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):** శ్రీరంగాపూర్ మండలం నాగరాల గ్రామానికి చెందిన గుంటి బాలక్రిష్ణ 12 ఏళ్లుగా నివాస స్థల పట్టా కోసం ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగారు. గ్రామ నాయకులు సహకరించకపోవడం, అధికారుల దాఖలాలు లేవడం వల్ల సమస్య పరిష్కారం కావడంలేదు. ఆఖరి ప్రయత్నంగా ప్రజావాణి కార్యక్రమంలో తన సమస్యను వెల్లడి చేసిన వెంటనే, ప్రజావాణి ఇంచార్జ్ మరియు రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి ప్రత్యేక చోరవతో నివాస స్థల పట్టాను అందజేశారు.తన సమస్య పరిష్కారం అయిన సందర్భంగా గుంటి బాలక్రిష్ణ డాక్టర్ చిన్నారెడ్డిని శాలువాతో సన్మానించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వనపర్తి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేంద్రప్రసాద్ యాదవ్ పాల్గొన్నారు.



# బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో

**తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డా కే.వి. కృష్ణారావు**

**ఖమ్మం బ్యూరో చీఫ్, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** సెప్టెంబర్ 26వ తేదీన ఖమ్మం కలెక్టరేట్ ధర్నాచౌక్ వద్ద జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి పర్యవేక్షణ లో ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నారాయణవరపు శ్రీనివాస్ బి సి లకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్ ఖచ్చితంగా అమలు చేయాలని కోరుతూ ఆమరణ నిరాహార దీక్ష చేపట్టనున్నారు . ఈ దీక్షకు సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డా కే.వి.కృష్ణారావు పేర్కొన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు కామారెడ్డి బి.సి.డిక్లరేషన్ సభలో బి.సి.లకు స్థానిక సంస్థల ఎన్నికలలో 42% రిజర్వేషన్ సౌకర్యం కల్పిస్తామని వాగ్దానం చేసిందని , దానికి అనుగుణంగానే కాంగ్రెస్ పార్టీ అధికారామ్ లోకి వచ్చాక అసెంబ్లీ లో తీర్మానం చేసి కేంద్ర ప్రభుత్వం కి పంపింది . రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో 42 % రిజర్వేషన్ ను అమలు జరిగేలా చూడాలని ఏవిధమైన అడ్డంకులు వచ్చినా వాటిని కాంగ్రెస్ పార్టీ పరిస్కరించి ఇచ్చిన మాటను ఖచ్చితంగా నిలబెట్టుకోవాలని , ఆ దిశగా అడుగులు వేయాలని డిమాండ్ చేశారు . బి.సి.ల స్థానిక సంస్థల రిజర్వేషన్ కోసం ఆమరణ దీక్షకు పూనుకోవటమనేది చాలా గొప్ప విషయం అని అన్నారు . ఈ కార్యక్రమాన్ని ఖమ్మం జిల్లాలో ఉన్న అన్ని బి.సి. సంఘాలు పార్టీల కి అతీతంగా బీసీలు అందరూ మద్దతు ఇచ్చి విజయవంతం చేయాలని కోరారు . ఈ కార్యక్రమంలో జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మోడేపల్లి కృష్ణమాచారి , తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఉమ్మడి ఖమ్మం జిల్లా చైర్మన్ పసుపులేటి నాసరయ్య , మహాత్మా జ్యోతిబా పూలే ఐడియాలజీ సొసైటీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు పెళ్ళూరి విజయకుమార్ , తెలంగాణ ఉద్యమ కారుల ఫోరం ఖమ్మం జిల్లా మహిళా అధ్యక్షురాలు రెడ్డబోయిన వరలక్ష్మి , కామని అనంత లక్మి , జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఖమ్మం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పుల్లారావు గౌడ్ , జిల్లా ప్రధాన కార్యదర్శి శివరామకృష్ణ , టౌన్ అధ్యక్షుడు మల్లికార్జున్ , జిల్లా యూత్ అధ్యక్షుడు కూరపాటి సతీష్ , టౌన్ మహిళా అధ్యక్షురాలు గాజుల శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు





# ఆరెంపులలో ఆనందోత్సవం... పొంగులేటి క్రీమ్ కలర్ కుర్తా పైజామా ప్రత్యేక ఆకర్షణ!

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** ఆరెంపుల గ్రామం బుధవారం పండుగ వాతావరణంలో కళకళలాడింది. కొత్తగా నిర్మించిన ఇందిరమ్మ ఇళ్ల గుమ్మాల వద్ద పూలతోరణాలు... ప్రాంగణంలో రంగురంగుల ముగ్గులు... గృహాల చుట్టూ వినిపించిన మంగళధ్వానాలు కొత్త జీవితానికి సంకేతాలు వెలిగించాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద పైలెట్ ప్రాజెక్టుగా ఎంపికైన ఈ గ్రామంలో గృహప్రవేశాలు ఘనంగా జరగగా... ముఖ్య అతిథిగా తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి రాకతో ఉత్సవం మరింత ఉప్పొంగింది. ఈ వేడుకలో మంత్రి పొంగులేటి వస్త్రధారణ ప్రత్యేక ఆకర్షణగా అందరి చూపులను కట్టిపడేసింది. ఆయన ధరించిన క్రీమ్ కలర్ కుర్తా పైజామా అందరి దృష్టిని తనవైపు తిప్పేసింది. గ్రామస్తులు "పొంగులేటి శీనన్న సాదాసీదా స్టైల్ ఎంత బాగుందో!" అంటూ చర్చించుకున్నారు. కొత్తగా గృహ ప్రవేశం చేసుకున్న వారందరికీ మంత్రి పొంగులేటి అభినందనలు తెలిపి... పట్టు వస్త్రాలను కానుకగా సమర్పించారు.


# బతుకమ్మ చీరెలను రాష్ట్ర మహిళలందరికీ దసరా కానుకగా ఇవ్వాలి

**సిపిఐ మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి**



**హసన్ పర్తి,సెప్టెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** రాష్ట్ర ప్రభుత్వం దసరా పండుగ సందర్భంగా బతుకమ్మ కానుకగా మహిళలకు ఇస్తున్న చీరలను తెలంగాణలోని మహిళలందరికీ ఇచ్చి గౌరవించాలని మహిళా సమైక్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం రోజున హసన్ పర్తి మండల కేంద్రంలో మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేవలం మహిళా పొదుపు సంఘాల సభ్యులకు మాత్రమే చీరలను పంపిణీ చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతోందని ఇది ఎంత మాత్రం మంచిది కాదని కొంతమంది మహిళలకు ఇచ్చి, కొంతమంది ఇవ్వకుండా ఉండటం వారిని అవమానించటమేనని అన్నారు.ప్రభుత్వం ఇప్పటికైనా తన తప్పిదాన్ని గుర్తించి రాష్ట్రంలోని మహిళలందరికీ దసరా కానుకగా చీరెలను పంపిణీ చేయాలని కోరారు. ఈ విషయాన్ని పాలకులు గుర్తించాలని హెచ్చరించారు.ఈకార్యక్రమంలో దొమ్మాటి ప్రవీణ్ కుమార్,కౌసల్య,రమా,అక్షయ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు



**కుషాయిగూడ, సెప్టెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ లో కుషాయిగూడలోని శ్రీ పద్మావతి వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో జరుగుతున్న శరన్నవరాత్రి దసరా ఉత్సవాలు ప్రతి రోజు ప్రత్యేక ఆభరణాలతో, భిన్న రూపాల్లో అమ్మవారు దర్శనమివ్వడం విశేషంగా సాగుతోంది. మూడవ రోజు అమ్మవారు గజ లక్ష్మి రూపంలో అలంకరించబడగా, సదరు రూపంలో దర్శనమిచ్చిన అమ్మవారిని చూసేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలి వచ్చారు. ఆలయ ప్రాంగణం నవరాత్రి భక్తి శోభతో నిండిపోయింది.ఈ సందర్భంగా ఆలయాన్ని పూలతో, విద్యుత్ దీపాలతో ప్రత్యేకంగా అలంకరించారు. అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు, అలంకారాలు, మంగళహారతులు నిర్వహించగా, భక్తులు శ్రద్ధగా పాల్గొన్నారు.అలంకరణ కర్తగా వ్యవహరించిన ఏవిఎస్ఎన్ రియల్టర్స్ సంస్థ అధినేత & ఆలయ ఫౌండర్ కుటుంబ సభ్యుడు పల్లె సురేందర్ రెడ్డి తన సతీమణితో కలిసి అమ్మవారి సేవలో పాల్గొని, ఆలయ అభివృద్ధి కోసం రూ.50,000 విరాళంను ఆలయ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ మఠం వీరేషంకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ "ఆలయ అభివృద్ధి కోసం మా వంతు సహాయం ఎల్లప్పుడూ ఉంటుంది. భక్తుల సౌకర్యార్థం త్వరలో మరిన్ని పనులు చేపట్టాలని సంకల్పించాం" అని తెలిపారు. ఈకార్యక్రమం లో ఆలయ మాజీ ధర్మకర్తలు మాదిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, సప్పిడి శ్రీనివాస్ రెడ్డి, కోమిరెల్లి సుధాకర్ రెడ్డి, వట్టికూటి లక్ష్మీనారాయణ, నిమ్మ పద్మ, అలాగే అర్చకులు బిటుకూరి లక్ష్మణాచారి, కలకోట వెంకట రమణచార్యులు, ఆరుట్ల నారాయణచార్యులు, వేణుగోపాలచార్యులు, గుంటూరు శ్రీనివాస్, వెంకట్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారి దివ్య దర్శనాన్ని స్వీకరించారు. ఆలయ ప్రాంగణంలో భక్తి గీతాలు, వేద మంత్రాలు మార్మోగుతూ వాతావరణం ఆధ్యాత్మికంగా మారింది.

# డాక్టర్ పులిపాటి ప్రసాద్‌కు జీ టీవీ అచీవ్‌మెంట్ –2025 అవార్డు



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** ఖమ్మం పౌర సమితి మహాత్మా గాంధీ ఫౌండేషన్ ల చైర్మన్ న్యాయవాది ప్రముఖ విద్యావేత్త డాక్టర్ పులిపాటి ప్రసాద్ ప్రతిష్టాత్మక జీ టీవీ అచీవ్‌మెంట్ అవార్డు-2025 ను ఘనంగా అందుకోనున్నారు. ఈ కార్యక్రమం ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సమక్షంలో జరగనున్నది. పద్మ విభూషణ్ నాగేశ్వర్ రెడ్డి పద్మశ్రీ మందా కృష్ణ పలు నంది అవార్డుల గ్రహీత తనికెళ్ల భరణి వంటి ప్రముఖులు కూడా ఈ వేడుకలో పాల్గొన బోతున్నారు.ఈ సందర్భంగా డా. పులిపాటి ప్రసాద్ సేవా కృషిని ప్రశంసిస్తూ పలువురు ప్రముఖులు శుభాకాంక్షలు తెలిపారు.అభినందనలు తెలిపిన వారిలో కడవెండి శ్రీనివాస్ కొత్త వెంకటేశ్వర రావు గోళ్ళ రాధాకృష్ణ షేక్ ఖాసిం సతీష్ చౌదరి గుమ్మడివెల్లి శ్రీనివాస్ వరప్రసాద్ మృత్యుంజయ గుప్తా వజీనేపల్లి శ్రీనివాస్ సిద్ధంశెట్టి శ్రీకాంత్ పద్మజా రెడ్డి శ్రీకళా రెడ్డి రాజారెడ్డి రాజేష్ ప్రతాప్ నీరజ రామకృష్ణ కొదుమూరి జగన్నాథం కొదుమూరి భద్రయ్య వెల్లంపల్లి వెంకట సుబ్బారావు రాజారావు కొల్లూరు కృష్ణమూర్తి బూర్లె లక్ష్మీనారాయణ బూర్లె వెంకటేశ్వర్లు పాల్వంచ రామారావు కొత్తూరు రమేష్ తదితరులు వున్నారు.

# తప్పు హామీలతో రైతులను మోసం చేస్తున్న కాంగ్రెస్


**ఘనపూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ల కృష్ణయ్య**




**ఖిల్లా ఘనపూర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** వనపర్తి జిల్లా, ఘనపూర్ మండల కేంద్రంలోని గణపసముద్రం చెరువు దాదాపు 35 సంవత్సరాలుగా ఎలాంటి నీటి వసతులు లేక, నర్రెలు బారిన చెరువుగా ఉంది. 2017లో ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షులుగా ఉన్న సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, ప్రభుత్వ కేటాయింపులు లేకపోయినా, సీఎం కేసీఆర్‌తో సమన్వయం చేసి, కే.ఎల్.ఐ ద్వారా మంగనూరు నుంచి గణపసముద్రానికి నీరు సరఫరా చేశారు. ఘనపూర్ బిఆర్ఎస్ మండల అధ్యక్షులు రాళ్ళ కృష్ణయ్య తెలిపారు, చెరువు వెనుక ఎన్నో సంవత్సరాలుగా సాగునీరు లేక కంపచెట్లతో నిండిన పొలాలను పచ్చని పంటలుగా మార్చడం జరిగింది. మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి రైతుల విజ్ఞాపన మేరకు 2023 జూలై 20న కొత్త జీవో ద్వారా 12 లక్షల కింద చెల్లించే విధంగా నిర్ణయం తీసుకున్నారు.

అయితే, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి టి. మేగారెడ్డి ఎన్నికల్లో హామీలతో రైతులను మోసం చేసి, ఎకరాకు 20-25 లక్షలు ఇవ్వాలని ప్రకటించారు. రాధాకృష్ణయ్య అన్నారు, "మేఘారెడ్డి ఓట్లు గణపసముద్రం రైతులకు న్యాయం చేస్తాడా? రేవంత్ రెడ్డికి ఓట్లు ఇచ్చినా రైతులకు న్యాయం జరుగుతుందా?" ఘనపూర్‌లో బిఆర్ఎస్ పార్టీ రైతుల పక్షంలో మద్దతుగా ఉంటుందని వారు చెప్పారు.

తెలంగాణ ముచ్చట్లు
TELANGANA MUCHATLU
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక





# రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రతి అర్హుడికి ఇల్లు... ఆర్థిక మద్దతు అందించడం ప్రభుత్వ లక్ష్యం..

- రైతుల ఆత్మగౌరవం, సంక్షేమం కోసం ప్రభుత్వం చర్యలు..
- మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి వెల్లడి

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** అశ్వరావుపేట డివిజన్లో కొత్తగా ఏర్పాటు అయిన వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ ఆత్మ కమిటీ రైతు సంక్షేమానికి ముఖ్యమైన ఘట్టంగా రైతు సలహా కమిటీ చైర్మన్ ... 24 మంది సభ్యుల ప్రమాణ స్వీకారోత్సవం, 966 ఇల్లు లబ్ధిదారులకు మంజూరు పత్రాల పంపిణీ, అలాగే కళ్యాణ లక్ష్మి మరియు షాదీ ముబారక్ పథకాల కింద 19 లబ్ధిదారులకు 19, 02,204 చెక్కుల పంపిణీ కార్యక్రమం అశ్వారావుపేట లోని శ్రీ శ్రీ కళ్యాణ మండపంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి, అశ్వారావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్ , ఇతర అధికారులు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆత్మ కమిటీ చైర్మన్ సుంకవెల్లి వీరభద్రరావు , 24 సభ్యులు నియామక పత్రాలు అందుకుని ప్రమాణ స్వీకారం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ .... రైతుల సంక్షేమం, పేదవర్గాల ఆత్మగౌరవం కోసం ప్రభుత్వం పాటుపడుతుందని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలు ప్రతి పేదవాడికి నిజమవ్వాలని, రాబోయే మూడు సంవత్సరాల్లో ప్రతి అర్హుడికి ఇల్లు, ఆర్థిక మద్దతు, భరోసా , భద్రత అందించడం ప్రధాన లక్ష్యం అని మంత్రి స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటికే ఇళ్ల నిర్మాణం, మహాలక్ష్మి పథకం కింద మహిళలకు ఉచిత ప్రయాణం, 200 యూనిట్ల వరకు ఉచిత కరెంటు, 500 కే గ్యాస్, గత ప్రభుత్వం ఇవ్వని రేషన్ కార్డులను ప్రజా ప్రభుత్వం ఏర్పడిన త్వరత సుమారు 11 లక్షల మందికి నూతన రేషన్ కార్డులు, సుమారు 7 లక్షల మంది పాత రేషన్ కార్డులలో పేర్ల నమోదు చేసిన ఘనత ఈ ప్రభుత్వానిదే అన్నారు. ఈ విధంగా అనేక సంక్షేమ కార్యక్రమాలు విజయవంతంగా అమలు అయ్యాయని, ప్రతి పేదవాడికి హక్కులు, వసతులు సులభంగా అందించబడే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి బాగోలేనప్పటికీ ఎటువంటి ఆర్భాటాలకు పోవటం ఏది చేయగలము ఏది చేయలేము అని అంచనాతో ప్రతి వర్గానికి చెబుతూ పేదవాడి గౌరవానికి భంగం కలగకుండా ఉండేవిధంగా పేదవాడు ఆత్మగౌరవంతో బతికే విధంగా పేదవాడికి పూర్తి మద్దతుగా ఈ ప్రభుత్వం నిలబడుతుందని మంత్రి స్పష్టం చేశారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని వినియోగించుకొని ప్రతి పేదవారికి మంచి చేసే కార్యక్రమాన్ని ఈనాడు ప్రభుత్వం చేస్తుందని అన్నారు. ఇల్లు అనేది పేదవారి ఆత్మగౌరమని వారి భరోసా భద్రత కల్పించే విధంగా ఇందిరమ్మ ఇండ్లు ప్రతి పేదవారికి అందిస్తున్నామని తెలిపారు. రాబోయే మూడు సంవత్సరాలలో రాష్ట్రవ్యాప్తంగా విడతల వారీగా అర్హులైన ప్రతి పేదవారికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయడమే ఈ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని మంత్రి తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయడం నుండి ఫౌండేషన్ గృహప్రవేశాల వరకు విడతల వారీగా లబ్ధిదారునికి ఖాతాలో నేరుగా ప్రతి సోమవారం నిధులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. పేదవారు ఎక్కడా తలదించుకో కూడదనే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనల పేదవారి అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు అమలు చేయడం జరుగుతుందన్నారు.

అనంతరం మంత్రి చేతుల మీదగా ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలు షాదీ ముబారక్, కళ్యాణ లక్ష్మి లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం జరిగింది.

ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఆర్డీవో మధు, గ్రంథాలయ చైర్మన్ వీరబాబు, హౌసింగ్ పిడి రవీంద్రనాథ్, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి బాబురావు, ఆత్మ కమిటీ డైరెక్టర్లు, రైతులు, ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.





# దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

- శ్రీ రాజరాజేశ్వర దేవాలయాన్ని సుందరకరిస్తాం
- వర్ధన్నపేట ఎమ్మెల్యే కే.ఆర్ నాగరాజు

**హసన్ పర్తి,సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే నాగరాజు. హనుమకొండ జిల్లా హసన్ పర్తి మండలం అనంతసాగర్ గ్రామంలోని దేవి శరన్నవరాత్రి ఉత్సవంలో భాగంగా ఏర్పాటు చేసిన అమ్మవారి విగ్రహానికి ప్రత్యేక పూజలు నిర్వహించి అన్నదాన కార్యక్రమాన్ని వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రారంభించారు.అనంతరం హసన్ పర్తి మండల పరిధిలోని కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అనంతసాగర్ గ్రామంలోని శ్రీ రాజరాజేశ్వర స్వామి దేవాలయానికి సుమారు 50 లక్షల రూపాయల నిధులు మంజూరు చేసామని త్వరలో పనులు పూర్తి చేయించి ఆలయాన్ని సుందరీకరిస్తామని తెలియజేశారు. అదేవిధంగా మడిపల్లి గ్రామంలో 20 లక్షల రూపాయల నిధులతో నూతనంగా చేపట్టిన గ్రామ పంచాయతీ భవన నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలించి భవన నిర్మాణ నాణ్యతను సమగ్రంగా తనిఖీ చేసి పనులు గరిష్ట నాణ్యతతో పూర్తి చేయడం కోసం సూచనలు అందించారు. అదే గ్రామానికి చెందిన బుర్ర సుధాకర్ పంట పొలాల కోసం భావి తవిస్తుండగా ప్రమాదవశాత్తు గాయపడడంతో వారిని పరామర్శించి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పి అవసరమైన వైద్య సహాయం అందేలా చూడాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో ఆత్మకూరు ఏఎంసి వైస్ చైర్మన్ తంగళ్ళపల్లి తిరుపతి, మండల అధ్యక్షుడు పోరెడ్డి మహేందర్ రెడ్డి, గ్రామ అధ్యక్షులు కుమార్,మాచర్ల మహేందర్,వట్టే శ్రీనివాసరెడ్డి,బుచ్చిరెడ్డి,చంటి రెడ్డి,చిర్ర సుమలత విజయ్,రామంచ ఐలయ్య,దయాకర్,మాట్ల విష్ణు తదితరులు పాల్గొన్నారు.

# పిల్లలు కాదు- పిశాచాలు

- భౌషత్ కాలానికి తలనొప్పులు
- తల్లి దండ్రులకు శాపగ్రస్తులు
- సామాజిక వేత్త లోడిగ వెంకన్నయాదవ



**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** 'పిల్లలు కాదు పిడుగులు' అని పెద్దలు ముచ్చటగా అలనాటి సామెత మాట. కాని ఈ నాటి పిల్లలు పదోతరగతి పూర్తి చేసిన నాటినుండి వాడు జీవితం లో సెటిల్ అయ్యేవరకు కొందరు పిల్లలు తల్లిదండ్రులకు పిడుగులు కాదు పిచాచులుగా తయ్యారు అవుతున్నారు. సమాజానికి, కన్నతల్లిదండ్రులకు ముచ్చెమటలు పట్టిస్తున్నారు. అటు సామాజంలో ఇటు కుటుంబం లో కునుకు లేకుండా చేస్తున్నారు. పిల్లల పెంపకం తో పనిలేకుండా చిన్న నాటినుండి నేర ప్రవృత్తి తో పెరుగుతున్నారు చుట్టూఉన్న వారి పరిసరాల ప్రభావం , స్వేచ్ఛగా జీవించే వెసులుబాటు, భౌషత్ అవసరాలకు సరిపడా ఆర్థిక వెసులుబాటు కుటుంబానికి కలిగి ఉండటం ఇదిఅవసరం అని తెలిసేలోపే పిల్లలకు తల్లి దండ్రులు సర్దుబాటు చేయడం వలన పిల్లలకు తన అవసరం ఏమిటో తెలియకుండా పోతుంది. పిల్లలను తీక్షణంగా గమనిస్తే తప్ప వారు తప్పటడుగులు వేస్తున్నారు అనే విషయం గమనించ లేనంతగా ఉంటున్నారు. ఎవరి స్థాయిలో వారికి చెడిపోవడానికి ఆ కుటుంబ వెసులుబాటు లేదా అవసరానికి సమకూర్చగలిగిన స్తోమత,వారికి కావలిన సాదనాలు అవసరం లేక పోయినా బండి, సెల్లు,కారు, డబ్బు, విలాసవంతమైన ఇల్లు, పల్లేల్లో రాజకీయ నేపథ్యంతో కూడిన వాతావరణం ఇలా ఒకటి అనికాదు తొందరగా చెడిపోవడానికి కావలసిన ప్రతీఒక్కసాదనాలు అందుబాటులో ఉంటున్నాయి .ఇది చేయవచ్చు చేయకూడదు అని ఆలోచన శక్తి లేకుండా స్నేహం ఇంటర్ నెట్, హర్రర్ చిత్రాలు, యూటూబ్ లో ఎక్కువ సమయం పలుకారణాలు వారికి దగ్గర గా ఉన్నాయి వాటితో గడపటానికి ఎక్కువ ఇష్టపడతారు. ఉమ్మడి కుటుంబాలు గా లేకపోవడం, అడిగిందే తడువుగా తల్లిదండ్రులు ఇవ్వడం ఆహార అలవాట్లు,చిరుతిండ్లకు అలవాటు పడటం ఒకటి కి ఇంకొకటి తోడుగా పిల్లల ఆలోచనలు రూపాంతరం చెందుతున్నాయి. మత్తుపానీయాలు, గంజాయి, గుట్కా వంటి మత్తు పదార్థాలు సైతం తల్లి దండ్రుల కంటపడకుండా అలవాటు చేసుకొని ఆమైకంలో తప్పులు చేసి తల్లిదండ్రులకు తలనొప్పులు తెచ్చి కుటుంబం వీదిన పడేలా చేస్తున్నారు. జీవితంలో స్థిరపడటానికి కావాలిసిన మార్గాలకంటే విలాసవంతమైన జీవితం,ఇదే ప్రపంచం అని భ్రమించి ఇటు సమాజాన్ని అటుకుటుంబాని మతి భ్రమించేలా చేస్తున్నారు. క్రిమినల్ మైండ్ తో అనునిత్యం నేరపూరితమైన జీవితంలో మునిగిపోతున్నారు. జీవితం గురించి కుటుంబం గురించి ఆలోచన లేకుండా మూడు పదుల వయస్సు దాటుతున్నా ఉద్యోగం, పెండ్లి, సోసైటి కుటుంబ భాద్యత మరిచి ముప్పేట మూడుపూటలు తిని కన్న తల్లి దండ్రులకు భారంగా మారుతున్నారు. కన్ననేరానికి భరించక తప్పదు అన్నట్టుగా తల్లి దండ్రులకు శాపగ్రస్తులు గా కొందరు యువత సమాజానికి, కుటుంబానికి భారంగా తయ్యారు అవుతున్నారు. కొందరికి ఆకలి, అవసరం అనేది లేకుండా తిరుగుతున్నారు. చేసి బ్రతుకటానికి ఉద్యోగం ఒక్కటే మార్గం కాదు.. వళ్ళువంచి పనిచేస్తే పలు మార్గాలు యువత కాళ్ళదగ్గరకు వస్తాయి. కాని పనిచేసి బ్రతికే అవసరం లేకుండా పోతుంది ఈ నాటి కొందరి యువతకు

ఆర్థికంగా వెసులుబాటు కలిగి ఉండటం, మధ్యతరగతి చిన్నకుటుంబాలకు ప్రభుత్వం సంక్షేమ నిత్యఅవసర వస్తువులు, పింఛను, వ్యవసాయ,కార్మికుల జీవనోపాధి పథకాలు, ఆర్థిక వెసులుబాటు కొరకు ఓట్ల భయంతో రాజకీయ నాయకులు అందిస్తున్న తాయిలాలు ప్రభుత్వ స్కీముల రూపంలో పని చేయకుండా యూవత సోమరితనాన్ని పెంచే ప్రభుత్వ పథకాలు రేపటి కోరకు తిండి లేదు అనే భయం ఈనాటి యువతకు ప్రభుత్వం అందిస్తున్న కిలో రూపాయి సన్నబియ్యం,ఉప్పు పప్పు చింతపండు పంచదార సబ్బులు కూడా ప్రభుత్వ రేషన్ షాపులో దొరుకుతాయి. గ్రామంలో ఉన్న జనాభాకంటే కుటుంబ రేషన్ కార్డ్ లు ఎక్కువ గా ఉన్నాయి. యువతకు ఉపాధి కల్పించే పథకాలు రచించకుండా ఉచితంగా ఉపాధి కల్పించే విధంగా ప్రభుత్వ పథకాలు ఉన్నాయి. చిన్నతనంలో నే డ్రగ్స్ కు అలవాటు పడకుండా ,మత్తుపదార్థాల కు దూరంగా ఉండే కటినంగా వ్యవహరించే చట్టాలు, అరికట్టే వ్యవస్థ ఇప్పుడు ఎంతో అవసరం.అతరహాలో ప్రభుత్వం ఆలోచన చేయకపోతే చెతికి వచ్చిన యువత చేజారిపోతుంది. అటుసమాజానికి ఇటు కుటుంబానికి యువత భారంగా మారేరోజు వస్తుంది. యువత పెడదారి పట్టకుండా ప్రభుత్వాలు జాగ్రత్త పడాలి..యువత తస్మాత్ జాగ్రత్త

# ఎమ్మెల్యే పర్యవేక్షణలో చిన్న పిల్లల వాక్సినేషన్ కార్యక్రమం విజయవంతం



**కాప్రా, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం, మీర్పేట్ హెచ్.బీ కాలనీ పరిధిలోని వార్డు కార్యాలయంలో చిన్న పిల్లల కోసం ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాక్సినేషన్ (టీకాల) కార్యక్రమం విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి పర్యవేక్షించారు. స్థానిక కార్పొరేటర్ జెరిపోతుల ప్రభుదాస్ కూడా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఎమ్మెల్యే మాట్లాడుతూ, చిన్న పిల్లలకు వ్యాక్సినేషన్ చాలా అవసరం అని, టీకాలు వారికి ప్రాణాంతక వ్యాధుల నుండి రక్షణ కల్పిస్తాయని, మరియు శరీరాన్ని వ్యాధులతో పోరాడటానికి శిక్షణ ఇస్తాయని తెలిపారు. "వ్యాక్సినేషన్ షెడ్యూల్‌ను సకాలంలో పాటించడం ద్వారా పిల్లలు ముఖ్యమైన వ్యాధుల నుంచి రక్షణ పొందతారు. ఇది భవిష్యత్తులో వారి ఆరోగ్యానికి మద్దతు ఇస్తుంది" అని ఎమ్మెల్యే పేర్కొన్నారు.కార్యక్రమంలో బీసీజీ, పోలియో, మీజిల్స్, గవదబిళ్లలు, రుబెల్లా, డిఫ్తీరియా, టెటానస్, పెర్టుసిస్ (కోరింత దగ్గు), హెపటైటిస్ బి, మరియు హిబ్ వంటి తీవ్రమైన వ్యాధుల నుండి పిల్లలను రక్షించే టీకాలు అందించబడ్డాయి. ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి, వాక్సినేషన్ వివరాలను సిబ్బందితో తెలుసుకున్నారు మరియు ఈ కార్యక్రమం పై సంతృప్తి వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం నాగుబాయి, ఇతర ఆరోగ్య సిబ్బంది మరియు స్థానిక నాయకులు పాల్గొని, చిన్న పిల్లల ఆరోగ్య పరిరక్షణలో తమ భాగస్వామ్యాన్ని చూపారు. ఎమ్మెల్యే ప్రత్యేకంగా తల్లిదండ్రులను, పిల్లల టీకాలను సమయానికి పూర్తి చేయాలని, మరియు వార్డు కార్యాలయాలు, ఆరోగ్య కేంద్రాల ద్వారా సకాలంలో వాక్సినేషన్ పొందాలని సూచించారు.ఈ కార్యక్రమం, స్థానిక ప్రజల్లో అవగాహన పెంచి, చిన్న పిల్లల ఆరోగ్య రక్షణకు దోహదపడటంతో పాటు, ప్రజలలో పిల్లల ఆరోగ్యంపై ప్రభుత్వ పట్టుదలను మరోసారి చూపించింది.

# హెచ్ఎంటి చెరువు కట్ట వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ



- స్థానిక వాకర్లకు ఊరటనిచ్చే చర్య
- కార్పొరేటర్ శాంత సాయిజన్ శేఖర్

**నాచారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** ఉప్పల్ నియోజకవర్గం కాప్రా సర్కిల్ నాచారం డివిజన్ లో హెచ్ఎంటి నగర్ చెరువు కట్ట నుండి హైకోర్టు కాలనీ వరకు విస్తరించి ఉన్న వాకింగ్ ట్రాక్‌లో గుంతలు, మట్టి రోడ్డు సమస్యల కారణంగా ప్రతిరోజూ వాకింగ్ చేసుకునే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో మరింతగా ఈ మార్గం దారుణ పరిస్థితికి చేరడంతో వాకర్లకు అసౌకర్యం కలుగుతున్న విషయం స్థానికులు పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఈ నేపథ్యంలో, సుమారు రూ.17 లక్షల వ్యయంతో వాకింగ్ ట్రాక్ పునరుద్ధరణ పనులు చేపట్టబడ్డాయి. ట్రాక్‌లో ఏర్పడిన గుంతలను పూడ్చి, కొత్త మట్టిని వేసి, రోడ్డును చదును చేసే పనులు వేగవంతంగా కొనసాగుతున్నాయి. దీనివల్ల వాకర్లకు సురక్షితంగా, సౌకర్యవంతంగా నడిచే వాతావరణం కలగనుంది.

బుధవారం రోజు ఈ పనులను నాచారం డివిజన్ కార్పొరేటర్ శాంతి సాయిజెన్ శేఖర్ ప్రత్యక్షంగా పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ -"ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని వాకింగ్ ట్రాక్‌ను ఆధునికంగా తీర్చిదిద్దుతున్నాము. స్థానికుల నుండి వచ్చిన అభ్యర్థనల ఆధారంగా జిహెచ్ఎంసి నిధులతో రూ.17 లక్షల వ్యయం చేసి ఈ పనులు చేపట్టాం. త్వరలో వాకర్లకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సౌకర్యవంతమైన వాకింగ్ ట్రాక్ అందుబాటులోకి రానుంది" అని పేర్కొన్నారు. అంతే కాకుండా ఆయన భవిష్యత్తు లో వాకింగ్ ట్రాక్ చుట్టూ లైటింగ్ సదుపాయాలు, చెట్ల పెంపకం, పార్క్ అభివృద్ధి వంటి పనులు కూడా దశలవారీగా చేపడతామని తెలిపారు.ఈ కార్యక్రమంలో హెచ్ఎంటి కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు యాదగిరి రెడ్డి, నర్సింగ్ రావు, కిరణ్, మక్బూల్, రామరాజు, సాయిజెన్ శేఖర్, కట్ట బుచ్చన్న, గౌడ్, విటల్ యాదవ్, భూపాల్ రెడ్డి, దాసరి కర్ణ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు. స్థానిక ప్రజలు ఈ పనులు ప్రారంభమైనందుకు సంతోషం వ్యక్తం చేస్తూ, కార్పొరేటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు.



# కమ్యూనికేషన్స్, ఐటీ స్టాండింగ్ కమిటీ సమావేశానికి హాజరైన ఖమ్మం ఎంపీ

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** కమ్యూనికేషన్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ స్టాండింగ్ కమిటీ సమావేశం.. బుధవారం న్యూఢిల్లీలో జరగ్గా.. ఖమ్మం ఎంపీ, స్టాండింగ్ కమిటీ సభ్యులైన రామసహాయం రఘురాం రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా..కమిటీ చైర్మన్ డాక్టర్ నిషికాంత్ దూబే, రాజ్యసభ సభ్యులు, ప్రసిద్ధ తెలుగు సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్, ఎంపీ, ప్రముఖ సినీనటి కంగనా రనౌత్.. పలు రాష్ట్రాల ఎంపీలతో కలిసి.. కీలక అంశాలపై చర్చించారు.



## ఎంపీ రఘురాం రెడ్డి ప్రత్యేక చొరవతో.. పార్లమెంట్ సందర్శించిన ఖమ్మం విద్యార్థులు

**ఈ అవకాశం కల్పించినందుకు పార్లమెంట్ సభ్యులు రామసహాయంకు కృతజ్ఞతలు తెలిపిన అభినవ్ స్కూల్ పిల్లలు, యాజమాన్యం**

**ఖమ్మం బ్యూరో, సెప్టెంబర్ 24, తెలంగాణ ముచ్చట్లు;** పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురాం రెడ్డి సిఫారసు లేఖతో విజ్ఞాన యాత్రలో భాగంగా న్యూఢిల్లీలోని భారత పార్లమెంట్ భవన సముదాయం, పార్లమెంట్ మ్యూజియాన్ని ఖమ్మం నగరంలోని అభినవ్ స్కూల్ విద్యార్థులు బుధవారం సందర్శించారు. ఇటీవల ఈ పాఠశాల యాజమాన్యం ఎంపీకి విజ్ఞప్తి చేయడంతో.. వెంటనే స్పందించి ఢిల్లీలోని ఉన్నతాధికారులతో మాట్లాడి ప్రత్యేక చొరవతో అక్కడ సందర్శన ఏర్పాట్లు పర్యవేక్షించడమే గాక..స్వయంగా విద్యార్థులను కలిసి అభినందించారు. ఈ సందర్భంగా..ఎంపీ మాట్లాడుతూ నేటి బాలలే రేపటి భావి భారత పౌరులని, దేశ అత్యున్నత చట్టసభను సందర్శించడం ద్వారా.. ప్రజాస్వామ్య గొప్పతనం, ప్రజాస్వామ్య పరిరక్షణకు కట్టుబడాలనే ఆకాంక్ష బాల్యం నుంచే మనసులో బలపడుతుందని హర్షం వ్యక్తం చేశారు. పార్లమెంట్ విశేషాలు తెలియజేసి.. విద్యార్థులను ప్రోత్సహించిన ఎంపీ రఘురాం రెడ్డికి అభినవ్ స్కూల్ ప్రిన్సిపాల్ పారుపల్లి అరుణ, కరస్పాండెంట్ రమణ, ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## కుషాయిగూడ డిపో మేనేజర్‌గా వేణుగోపాల్ బాధ్యతలు స్వీకరణ



**కుషాయిగూడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** కుషాయిగూడ ఆర్టీసీ డిపోకు కొత్త మేనేజర్‌గా వి. వేణుగోపాల్ బుధవారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. గత కొంత కాలంగా ఈ డిపో మేనేజర్‌గా సేవలందించిన మహేష్‌కుమార్ హెడ్ ఆఫీస్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో వేణుగోపాల్ నియమితులవడం తో డిపో సిబ్బందిలో కొత్త ఉత్సాహం నెలకొంది.ఈ సందర్భంగా నూతన మేనేజర్ వేణుగోపాల్ మాట్లాడుతూ,డ్రైవర్లు, కండక్టర్లు సమయపాలనకు ప్రాధాన్యం ఇవ్వాలని,ప్రయాణికుల సమస్యలు లేకుండా సకాలంలో బస్సులు నడపాలని,ప్రజల నమ్మకాన్ని మరింత పెంపొందించేందుకు అందరూ కృషి చేయాలని సూచించారు.డిపో అభివృద్ధి, ఆదాయ వృద్ధి, ప్రయాణికుల కు ఆధునిక సౌకర్యాలు కల్పించడం తన ప్రధాన లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ రవాణా సంస్థపై ప్రజల నమ్మకాన్ని నిలబెట్టడంలో సిబ్బందంతా సహకరించాలని వేణుగోపాల్ పిలుపునిచ్చారు.ఈకార్యక్రమంలో డిపో సిబ్బంది, యూనియన్ ప్రతినిధులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొని కొత్త మేనేజర్‌ను అభినందించారు. కొత్త మేనేజర్ బాధ్యతలు స్వీకరించడంతో రాబోయే రోజుల్లో కుషాయిగూడ డిపో సేవలు మరింత సమర్థవంతంగా కొనసాగుతాయని సిబ్బంది ఆశాభావం వ్యక్తం చేశారు.

## అయ్యప్ప కాలనీలో తాజ్ హాలు డే బ్రేక్ ఫాస్ట్ హోటల్ ప్రారంభం

**దమ్మాయిగూడ, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** దమ్మాయిగూడ మున్సిపాలిటీ పరిధిలోని అయ్యప్ప కాలనీలో కొత్తగా ఏర్పాటు చేసిన తాజ్ హాలు డే బ్రేక్ ఫాస్ట్ హోటల్ ప్రారంభోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నాగారం మాజీ చైర్మన్ చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఆరోగ్యకరమైన, రుచికరమైన భోజనం అందించే దిశగా కొత్త రెస్టారెంట్లు రావడం ఆనందకరమని, స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు కూడా కలుగుతాయని అన్నారు.ఈకార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ శ్రీనివాస్ గౌడ్, వసుపతి రమేష్ గౌడ్, మాజీ వార్డ్ మెంబర్ నాగేందర్, నరేందర్ రెడ్డి, గాలి సంపత్ యాదవ్, డొంకెన రవీందర్ గౌడ్, తోట నరేష్ పటేల్, రామకృష్ణ తదితర నాయకులు పాల్గొని హోటల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలిపారు.హోటల్ ప్రారంభోత్సవం సందర్భంగా స్థానికులు భారీగా తరలి వచ్చి ఆనందం వ్యక్తం చేశారు.








## సత్తుపల్లిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు.!




**మహిళలతో కలిసి ఆడిపాడారు, ఎమ్మెల్యే రాగమయి – దయానంద్ దంపతులు**

**సత్తుపల్లి, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):** సత్తుపల్లి పట్టణంలో బతుకమ్మ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఎమ్మెల్యే మట్టా రాగమయి, రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు మట్టా దయానంద్ దంపతులు కార్యక్రమంలో పాల్గొని మహిళలతో కలిసి బతుకమ్మ ఆడారు. జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో మున్సిపల్ కమిషనర్ ఆధ్వర్యంలో నిర్వహించిన వేడుకల్లో వేలాది మంది మహిళలు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల ప్రతి ఇంటిలో పండుగ వాతావరణం నెలకొన్నదని మట్టా దయానంద్ పేర్కొన్నారు. దసరా శుభాకాంక్షలు తెలియజేశారు.
కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ నరసింహ, స్థానిక అధికారులు, కాంగ్రెస్ పార్టీ పట్టణ, మండల నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, మహిళా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## పుట్టు చీర మహోత్సవంలో ఆగారం ప్రకాష్ దంపతులు

**వనపర్తి,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

ఖిల్లా ఘనపూర్ మండల కేంద్రానికి చెందిన కమ్మరి పులేందర్ వారి కుమార్తె పుట్టు చీర మహోత్సవం బుధవారం ఘనంగా జరిగింది. ఈ ప్రత్యేక సందర్భానికి ఆహ్వానితులుగా ఆగారం ప్రకాష్ దంపతులు పాల్గొన్నారు. చిన్నారిని నిండు నూరేళ్లు, ఆయురారోగ్యంతో, శాంతియుతంగా, సంతోషంగా ఉండాలని, కుటుంబం ఆనందంగా, సంపూర్ణ ఆరోగ్యంతో ఉండాలని ఆశీస్సులు అందజేశారు.
కమ్మరి పులేందర్ ఆహ్వానం మేరకు, పుట్టు చీర మహోత్సవంలో పాల్గొన్న ఆగారం ప్రకాష్ దంపతులకు కుటుంబం కృతజ్ఞతలు తెలిపింది. ఈ కార్యక్రమంలో చిన్నారి బంధువులు, సమీప మిత్రులు హాజరై, పుట్టు చీర మహోత్సవ వేడుకల్లో పాల్గొన్నారు.





## వివాహ నిశ్చితార్థ వేడుకలో పాల్గొన్న మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి దంపతులు

**వనపర్తి,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

మహబూబ్ నగర్ జిల్లా కేంద్రంలోని ఓం కన్వెన్షన్ హాల్లో వనపర్తి వాస్తవ్యులు, మాజీ కౌన్సిలర్ వసంత ఎర్రశ్రీ కుమారుడు ఇరిగేషన్ ఎఈఈ శివకుమార్ వాల్మీకి ఎంగేజ్మెంట్ వేడుకలో పాల్గొని, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి మరియు సింగిరెడ్డి వాసంతి శుభాకాంక్షలు తెలిపారు. వివాహ కార్యక్రమంలో మాజీ మంత్రి వెంట బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు నీల స్వామి, మాజీ కౌన్సిలర్ ఉంగుళం తిరుమల్, సోషల్ మీడియా అధ్యక్షులు సునీల్ వాల్మీకి, జనార్దన్, బాలరాజు, ప్రశాంత్ వాల్మీకి, జస్వంత్, జీప్ రమేష్, మన్నెం మరియు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

## అమ్మవారి మందిరంలో ఘనంగా శరన్నవరాత్రి వేడుకలు

**ఏ.ఎస్.రావు నగర్, సెప్టెంబర్ 24(తెలంగాణ ముచ్చట్లు)**

ఉప్పల్ నియోజకవర్గం, డా. ఏ.ఎస్.రావు నగర్ డివిజన్ పరిధిలోని జమ్మిగడ్డ బిజెఆర్ కాలనీలో శరన్నవరాత్రి ఉత్సవాలు భక్తి శ్రద్ధలతో అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. ఆజాద్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 21 ఏళ్ల క్రితం నెలకొల్పిన అమ్మవారి మందిరంలో బుధవారం జరిగిన ప్రత్యేక పూజలకు భక్తులు విశేషంగా హాజరయ్యారు.ఈ సందర్భంగా అమ్మవారు అన్నపూర్ణాదేవి అవతారంలో అలంకరించబడి భక్తులకు దర్శనమిచ్చారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడంతో పాటు ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందారు. ఆలయంలో నిర్వహించిన అన్నదాన కార్యక్రమంలో వందలాది మంది భక్తులు పాల్గొని ప్రసాదాన్ని స్వీకరించారు.ఈ కార్యక్రమాన్ని చిత్తారి ముదిరాజ్ ప్రత్యేకంగా పర్యవేక్షించారు. ఆలయాన్ని సందర్శించి పూజల్లో పాల్గొన్న వారిలో నీరుకొండ సతీష్ బాబు, మర్రి మోహన్ రెడ్డి, కన్నెబోయిన రమేష్ యాదవ్, ఏనుగు సీతారాం రెడ్డి, ఏనుగు మంజులారెడ్డి, కిరణ్ కుంటల, భవానీలు తదితరులు ఉన్నారు.స్థానిక భక్తులు మాట్లాడుతూ - "21 సంవత్సరాలుగా ఇక్కడ అమ్మవారి ఆలయం గ్రామస్థుల ఆధ్యాత్మికాభిమానానికి నిలయంగా మారింది. ప్రతి సంవత్సరం దసరా శరన్నవరాత్రుల్లో ఇక్కడ జరిగే ఉత్సవాలు ఎంతో భక్తిపూర్వక వాతావరణాన్ని సృష్టిస్తాయి" అని తెలిపారు. భక్తుల రద్దీతో ఆలయం ప్రాంతం పండుగ వాతావరణాన్ని తలపించింది.





## శ్రీ దేవి దసరా శరన్నవరాత్రులు

- 3వ రోజు అన్నపూర్ణా దేవి అలంకరణలో అమ్మవారి దర్శనం
- భక్తులకు అన్నప్రసాద వితరణ

**కీసర, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు)**

కీసరలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతున్నాయి. గ్రామ మండపంలో ప్రతిష్ఠించిన శ్రీ దుర్గాభవాని అమ్మవారు మూడవ రోజు అన్నపూర్ణా దేవి అవతారం ధరించి భక్తులకు అలౌకిక దర్శనం ఇచ్చారు.ఈ సందర్భంగా దాత కానుకుర్తి కృష్ణ బుధవారం ఉదయం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మండపం పర్యవేక్షకులు బెలిదే రమేష్ గుప్త సౌజన్యంలో గ్రామస్థులు, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు.అలాగే గ్రామ పురోహితులు బబ్లు ఆధ్వర్యంలో ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించబడ్డాయి. దసరా నవరాత్రుల్లో ప్రతి రోజు అమ్మవారిని విభిన్న రూపాల్లో అలంకరించి భక్తులకు దర్శనమివ్వడం ఆనవాయితీగా కొనసాగుతోంది.ఈ సందర్భంగా కీసర గ్రామస్థులు సింగోజి నర్సింహ చారి ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. వేలాది మంది భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకొని ప్రసాదాన్ని స్వీకరించారు.గత పది సంవత్సరాలుగా కీసరలో శ్రీ దుర్గాభవాని శరన్నవరాత్రి ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తూ వస్తున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.రేపటి రోజు మరింత వైభవంగా జరగనున్న పూజా కార్యక్రమాలకు ఇప్పటికే గ్రామస్థులు, భక్తులు సన్నద్ధమవుతున్నారు.

## బీఎల్‌ఓల పెండింగ్ భత్యంపై అధికారుల నిర్లక్ష్యం

- పెద్దమందడి తహసీల్దార్‌కు బీఎల్‌ఓలు వినతిపత్రం

**పెద్దమందడి,సెప్టెంబర్(24తెలంగాణ ముచ్చట్లు):**

పెద్దమందడి మండలం తహసిల్దార్ కార్యాలయంలో బుధవారం బీఎల్‌ఓ సమావేశం జరిగింది. 2002 జాబితాలో ఉన్నవారిని 2025 జాబితాతో సరిపోతున్నారా అనే సర్వే నిర్వహించారు. బీఎల్‌ఓలకు బాధ్యతలు అప్పగించబడ్డప్పటికీ, అధికారులు వత్తిడి మాత్రమే చేస్తున్నారు. భత్యంపై ఏ చర్య తీసుకోవడం లేదు.
2022 నుండి 2025 ఆగస్టు వరకు బీఎల్‌ఓలకు మొత్తం 27,000 రూపాయల భత్యం రావాల్సి ఉంది. ఇప్పటివరకు 7,500 రూపాయలే ఇచ్చారు, ఇంకా 19,500 రూపాయల పెండింగ్ ఉంది. బడ్జెట్ లేదని చెప్పడం తప్ప, ప్రతినెలా అందజేస్తామని స్పష్టంగా చెప్పడం లేదు. భత్యం కోసం కలెక్టర్ కార్యాలయంలో అనేక సార్లు వినతిపత్రాలు సమర్పించినా, అకౌంట్ నంబర్ తీసుకున్నప్పటికీ ఇప్పటివరకు భత్యం అందలేదు.
కొత్తవిధానం ప్రకారం 2025 మార్చి నుండి బీఎల్‌ఓలకు ప్రతినెలా 1,000 రూపాయల భత్యం పెంచినప్పటికీ ఆరు నెలలు గడిచినా ఏ స్పందన లేదు. బీఎల్‌ఓలు అంగన్వాడీ పనిని పక్కన పెట్టి బిఎల్‌ఓ డ్యూటీ నిర్వహిస్తున్నప్పటికీ, అధికారుల దృష్టికి రాలేదని నేతలు పేర్కొన్నారు. పండుగ సమీపంలో కనీసం సగం భత్యం ఇవ్వాలని కలెక్టర్ సార్‌కు విన్నవిస్తున్నట్లు తెలిపారు. జిల్లా ప్రధాన కార్యదర్శి మద్ల రాజు,జిల్లా కోశాధి బొబ్బిలి నీక్సన్, సహకారులు,రమాదేవి, నారాయణమ్మ, శారద సువర్ణ, లక్ష్మి రమాదేవి, సునీత భాగ్య, చెన్నమ్మ శారద తదితరులు పాల్గొన్నారు.



తెలంగాణ TELANGANA MUCHATLU
ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక



## బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలు

**నాచారం, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక సంప్రదాయం ప్రతీకగా జరుపుకునే బతుకమ్మ పండుగ ఉత్సవాలు నెక్లెస్ రోడ్డులో భారత రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో ఘనంగా సాగాయి. బుధవారం రోజు నాచారం డివిజన్ నుంచి సుమారు 50 మంది మహిళలు పూలతో అలంకరించిన బతుకమ్మతో ఉత్సాహంగా కార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ బృందానికి కార్పొరేటర్ శాంతి సాయి జెన్ శేఖర్ నేతృత్వం వహించగా, మహిళలు సంప్రదాయ నృత్యాలు, పాటలు మరియు బతుకమ్మకు ప్రత్యేక గీతాలతో పండుగ ఉత్సాహాన్ని పెంచారు. ఈ కార్యక్రమంలో నాచారం డివిజన్ మహిళా మాజీ ప్రెసిడెంట్ ప్రీతి రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు సాయి జెన్ శేఖర్, కట్ట బుచ్చన్న గౌడ్, విట్టల్ యాదవ్, భూపాల్ రెడ్డి, దాసరి కర్ణ చంద్రశేఖర్, వాసు కృష్ణ తదితరులు హాజరై మహిళలను అభినందించారు.ఉత్సవంలో స్థానికులు, పాఠకులు పెద్ద ఎత్తున హాజరై బతుకమ్మ పండుగను సాంప్రదాయ వైభవంతో ఆనందించారు. పూల గుట్టలు, సంప్రదాయ వస్త్రాలు, నృత్యాలు, గీతాలతో నగరం లోకానికి పండుగలో ప్రత్యేక ఆకర్షణను ఇచ్చాయి.నాయకులు మాట్లాడుతూ, ఈ కార్యక్రమం ద్వారా మహిళల సంఘటిత శక్తి, సాంప్రదాయాలపై గర్వభావం, యువతలో సంప్రదాయాల పట్ల ఆసక్తిని ప్రేరేపించడమే లక్ష్యమని తెలిపారు.వీరుల ప్రోత్సాహంతో భవిష్యత్తులో మరింత పెద్ద స్థాయిలోఈ పండుగను జరుపుకునే అవకాశాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు.




## ధర్మసాగర్ నూతన సీఐగా బాధ్యతలు స్వీకరించిన కే.శ్రీధర్ రావు

**ధర్మసాగర్,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

ధర్మసాగర్ పోలీస్ స్టేషన్‌కి నూతన సీఐగా కే. శ్రీధర్ రావు గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతకుముందు ఇక్కడ సీఐగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ బదిలీపై వెళ్లగా, ఆయన స్థానంలో శ్రీధర్ రావు బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని ఎస్సైలు, సిబ్బంది ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీధర్ రావు మాట్లాడుతూ నేరాల నిర్మూలన, శాంతిభద్రతల పరిరక్షణ, ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారం కల్పించడంలో కృషి చేస్తానని తెలిపారు. ప్రజలతో సమన్వయం కలిగించి, స్టేషన్ కార్యకలాపాలను మరింత సమర్థవంతంగా నిర్వహించేందుకు కట్టుబడి ఉంటానని చెప్పారు.



## రైతు ప్రయోజనాల కోసం ఆత్మ కమిటీ కృషి చేయాలి – ఎమ్మెల్యే జారె

**అశ్వారావుపేట, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

అశ్వారావుపేట మండల కేంద్రంలోని శ్రీ శ్రీ ఫంక్షన్ హాల్‌లో ఆత్మ కమిటీ సభ్యుల ప్రమాణస్వీకారోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణం, సమాచార-పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే జారె ఆదినారాయణ సమక్షంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు సుంకవల్లి వీరభద్రరావు ఆత్మ కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించారు. ఆయనతో పాటు మరో 25 మంది సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

జిల్లా కలెక్టర్ జితేష్ వి. పాటిల్తో కలిసి మంత్రి ప్రమాణ స్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. అనంతరం రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న పథకాలలో భాగంగా కళ్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. అదేవిధంగా ఐటీడీఏ ద్వారా గిరిజనులకు అదనంగా మంజూరైన 1000 ఇందిరమ్మ ఇండ్ల అర్హత పత్రాలను కూడా పంపిణీ చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు, కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## జిడబ్ల్యుఎంసి కార్యాలయంలో బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్న ఎంపీ కడియం కావ్య

**వరంగల్,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో జరిగిన బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించబడ్డాయి.వరంగల్ ఎంపీ కడియం కావ్య ముఖ్య అతిథిగా హాజరై, మహిళా సిబ్బందితో కలిసి బతుకమ్మ ఆడారు. మేయర్ గుండు సుధారాణి, కమిషనర్ చాహత్ బాజ్‌పాయ్ కూడా పాల్గొన్నారు. ఎంపీ కడియం కావ్య తన ప్రసంగంలో బతుకమ్మను తెలంగాణ మహిళల ఐక్యత, ఆత్మీయతకు ప్రతీకగా అభివర్ణించారు. ఈ పండుగ మహిళల సాధికారత, పర్యావరణ పరిరక్షణ, సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని చెప్పారు. బతుకమ్మ పాటలు నూతన తరాలకు సాంస్కృతిక విలువలను అందిస్తాయని, స్వయం సహాయక సంఘాల మహిళలు ఆర్థిక స్వావలంబనలో కీలక పాత్ర పోషిస్తున్నారని పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం మహిళా సాధికారత, గ్రామీణాభివృద్ధి కోసం చేపడుతున్న చర్యల్లో బతుకమ్మకు ప్రత్యేక స్థానం ఉందని తెలిపారు. పర్యావరణ హితంగా, సమైక్యతతో ఈ పండుగ జరుపుకోవాలని పిలుపునిచ్చారు.వేడుకల అనంతరం మహిళా సిబ్బంది ఎంపీతో సెల్ఫీలు తీసుకుని, సంతోషంగా ముచ్చటించారు. జిడబ్ల్యుఎంసి అధికారులు, సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.తత





## బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత కేసీఆర్

**నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద బిఆర్ఎస్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు**

**కార్పొరేటర్ గీత ప్రవీణ్ ముదిరాజ్**

**చిల్కానగర్, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక వైభవానికి ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండుగ వేడుకలు రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా జరుగుతున్నాయి. ఈ క్రమంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నెక్లెస్ రోడ్ పీపుల్స్ ప్లాజా వద్ద జరుగుతున్న బతుకమ్మ సంబరాలకు చిలుకానగర్ డివిజన్ నుండి కార్పొరేటర్ బన్నాల గీత ప్రవీణ్ ముదిరాజ్ మహిళా సోదరీమణులతో కలిసి భారీ ర్యాలీని నిర్వహించారు.ఉప్పల్ ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి ఆదేశాలు, బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో వందలాది మహిళలు సాంప్రదాయ వస్త్రధారణలో బతుకమ్మలు ఎత్తుకొని పాటలు పాడుతూ, నృత్యాలు చేస్తూ ఉత్సాహంగా పాల్గొన్నారు. డప్పుల వాయిద్యాలు, జానపద గీతాలతో ర్యాలీ ప్రాంతమంతా పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది .ఈ సందర్భంగా కార్పొరేటర్ గీత ప్రవీణ్ మాట్లాడుతూ -"బతుకమ్మ పండుగ తెలంగాణ సాంస్కృతిక ప్రత్యేకతకు అద్దం పడుతుంది. ఈ పండుగను దేశ విదేశాల్లోని తెలంగాణ ప్రజలు సైతం అదే ఉత్సాహంతో నిర్వహిస్తుండటం గర్వకారణం. బతుకమ్మను ప్రపంచానికి పరిచయం చేసిన ఘనత సీఎం కేసీఆర్‌దే" అని పేర్కొన్నారు.డివిజన్ మహిళా నాయకురాళ్లు, యువత, పెద్ద ఎత్తున స్థానిక మహిళలు ర్యాలీలో పాల్గొనడం విశేషం. పీపుల్స్ ప్లాజా వద్ద రాష్ట్ర వ్యాప్తంగా వచ్చిన వేలాది మంది మహిళలతో కలిసి చిలుకానగర్ మహిళలు బతుకమ్మ పండుగను అంగరంగ వైభవంగా జరుపుకున్నారు.






## పోలీసులు భారీగా కార్డన్ సెర్చ్ వాహనాలు గుట్కా మద్యం స్వాధీనం

**కీసర, సెప్టెంబర్ 24 (తెలంగాణ ముచ్చట్లు):**

కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో నేర నియంత్రణ, శాంతి భద్రత కాపాడడం, ప్రజల్లో భద్రతా భావన పెంపొందించేందుకు రాచకొండ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు బుధవారం సాయంత్రం 5 గంటల నుండి 7 గంటల వరకు భారీ కార్డన్ & సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు.లక్ష్మీనగర్, బండ్లగూడ ప్రాంతాల్లో జరిగిన ఈ తనిఖీలను మల్కాజిగిరి డీసీపీ పద్మజ ఐపీఎస్, అదనపు డీసీపీ వెంకటరమణ, ఏసీపీ వెంకటరెడ్డి పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో 4 ఇన్స్పెక్టర్లు, 16 సబ్ ఇన్స్పెక్టర్లు, 120 మంది పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.తనిఖీల్లో పోలీసులు పత్రాలు లేని 1 కారు, 3 ఆటోలు, 50 బైకులు స్వాధీనం చేశారు. అదేవిధంగా ఒక చిన్న గ్యాస్ సిలిండర్, రూ.2,000 విలువైన గుట్కా ప్యాకెట్లు, 7 లీటర్ల మద్యంను స్వాధీనం చేసుకున్నారు. డీసీపీ పద్మజ రెడ్డి స్వయంగా కార్యక్రమంలో పాల్గొని ఇద్దరు సస్పెక్టులు, ముగ్గురు రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇచ్చారు. అలాగే స్థానిక ప్రజలకు సైబర్ నేరాలు, మహిళలపై నేరాలు, మత్తు పదార్థాల దుష్ప్రభావాలుపై అవగాహన కల్పించారు. కీసర పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఏ. అంజనేయులు మాట్లాడుతూ, భవిష్యత్తులో కూడా ఇలాంటి కార్డన్ & సెర్చ్ కార్యక్రమాలు కొనసాగుతాయని, ప్రజలు పోలీసులకు సహకరించాలని పిలుపునిచ్చారు.





## ఇందిరాగాంధీకి కృతజ్ఞత నివాళులు అర్పించిన లంబాడి జేఏసీ

**వరంగల్,సెప్టెంబర్24(తెలంగాణ ముచ్చట్లు):**

లంబాడీలను గిరిజన జాబితాలో చేర్చేందుకు కృషి చేసిన అప్పటి దేశ ప్రధానమంత్రి ఇందిరాగాంధీ సేవలను స్మరించుకుంటూ గ్రేటర్ వరంగల్ లంబాడి జాయింట్ యాక్షన్ కమిటీ (ఎల్‌జేఏసీ) ఘనంగా నివాళులు అర్పించింది. లంబాడీలు రాజ్యాంగబద్ధంగా గిరిజన జాబితాలో చేరి 50 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాశిబుగ్గలోని ఇందిరాగాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఈ సందర్భంగా ఎల్‌జేఏసీ చైర్మన్ భూక్య మోతిలాల్ నాయక్, కన్వీనర్లు బానోత్ నవీన్ నాయక్, జవహర్‌లాల్ నాయక్ మాట్లాడుతూ ఇందిరాగాంధీ ప్రభుత్వంలోనే లంబాడీలతో పాటు గిరిజనులందరికీ విశేష లబ్ధి చేకూరిందని, వారి అభివృద్ధికి అది మైలురాయిగా నిలిచిందని గుర్తుచేశారు. ఆమె తీసుకున్న చారిత్రాత్మక నిర్ణయాన్ని గిరిజన వ్యతిరేకులు వ్యతిరేకించడం దురదృష్టకరమని ఖండించారు.

ఇందిరాగాంధీ స్మారకోత్సవ దినాలను ఈ నెల 31 వరకు కొనసాగిస్తూ లంబాడి యువత ప్రతిచోటా పూలమాలలు వేసి నివాళులర్పించాలని వారు పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో గ్రేటర్ వరంగల్ సమన్వయకర్తలు గుగులోత్ వీరమ్మ గోపి సింగ్ నాయక్, లకావత్ కరుణాకర్ నాయక్, సమ్మయ్య రాథోడ్, అజ్మీర వెంకట్ నాయక్, కోకన్వీనర్లు అమ్ముగోత్ సుధాకర్ నాయక్, లావుడియా రవి నాయక్, భుక్య సిద్ధు నాయక్, లావుడియా రాజు నాయక్, బానోత్ ఈర్య నాయక్, బాదావత్ ప్రదీప్ నాయక్, ధరావత్ రాము నాయక్ తదితరులు పాల్గొన్నారు.



# పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో మార్మోగిన ఇటలీ



ఇటలీలోని పలు నగరాలు సోమవారం పాలస్తీనా అనుకూల ప్రదర్శనలతో మార్మోగిపోయాయి. పాలస్తీనా దేశాన్ని గుర్తించేందుకు ప్రధాని జియార్జియా మెలోనీ నిరాకరించడంపై ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది మంది ప్రజలు రోడ్లపై కదం తొక్కుతూ తమను అడ్డుకున్న పోలీసులతో ఘర్షణకు దిగారు. రహదారులు, ఓడరేవులను దిగ్బంధించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న మారణహోమాన్ని నిరసిస్తూ 'ప్రతి దానినీ అడ్డుకోండి' అంటూ కార్మిక సంఘాలు ఇచ్చిన పిలుపు మేరకు దేశవ్యాప్త సమ్మె జరిగింది. మిలన్ నగరంలో నల్ల దుస్తులు ధరించిన ప్రదర్శకులు పాలస్తీనా పతాకాలు చేతపట్టుకొని సెంట్రల్ స్టేషన్‌లో ప్రవేశించారు. కిటికీ అద్దాన్ని ధ్వంసం చేశారు. పోలీసులపై కుర్చీలు విసిరారు. దీంతో వారిని చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయు గోళాలను ప్రయోగించారు. మిలన్ స్టేషన్ వద్ద జరిగిన ఘర్షణలో 60 మంది పోలీస్ అధికారులు గాయపడ్డారని, పది మందిని అరెస్ట్ చేశారని ప్రభుత్వ మీడియా తెలిపింది. పాలస్తీనా ప్రజలకు సంఘీభావం తెలుపుతూ కార్మికులు ఓడరేవుల్లో కార్యకలాపాలను అడ్డుకున్నారు. గాజాపై ప్రధాని మెలోనీ అనుసరిస్తున్న వైఖరిని ఆయన రాజకీయ ప్రత్యర్థులు తీవ్రంగా నిరసించారు. గాజాలో ఇజ్రాయిల్ సాగిస్తున్న హింస సిగ్గుచేటు అని మండి పడ్డారు. ఈ నెల ప్రారంభంలో జరిగిన ఐక్యరాజ్య సమితి సమావేశంలో పాలస్తీనా దేశానికి అనుకూలంగా ఇటలీ ఓటు వేసింది. అయితే ప్రధాని మెలోనీ మాత్రం పాలస్తీనాను గుర్తించడానికి నిరాకరిస్తు న్నారు. కాగా వెనిస్ ఓడరేవులో కూడా ప్రదర్శకులను అడ్డుకోవడానికి పోలీసులు నీటి ఫిరంగులను ఉపయోగించారు. జెనోవా, లివోర్నో, త్రిస్టే నగరాల్లోని ఓడరేవుల్లో కార్మికులు నిరసన ప్రదర్శనలు జరిపారు. గాజాలో హమాస్‌కు వ్యతిరేకంగా జరుపుతున్న యుద్ధంలో ఉపయోగించడానికి తమ ఓడరేవుల ద్వారా ఆయుధాలు, ఇతర సరఫరాలు రవాణా అవుతుండడంపై మండిపడిన కార్మికులు వాటిని అడ్డుకునే ప్రయత్నం చేశారు. బోలోగ్నాలో ప్రదర్శకులు హైవేని దిగ్బంధించారు. వాహనాలను అడ్డుకొని పోలీసులతో ఘర్షణకు దిగారు. దీంతో పోలీసులు నీటి ఫిరంగులను ప్రయోగించారు.



## కోటి రూపాయిలు విలువైన నిషేధిత మందులు స్వాధీనం

**తమిళనాడు:** తమిళనాడులోని అరక్కోణం రైల్వే స్టేషన్‌లో నిషేధిత టైడాల్ మాత్రలను అక్రమంగా రవాణ చేస్తున్న వారిని పోలీసులు స్వాధీనం పట్టుకున్నారు. పోలీసులు ఆకస్మిక తనిఖీలో ఐదుగురు వ్యక్తుల నుండి సుమారు రూ.1 కోటి విలువైన 30,000 మాత్రలను స్వాధీనం చేసుకున్నారు. అరెస్టు అయిన వ్యక్తులు కె. మస్తాన్ కుర్షిద్ అహ్మద్ (31), ఎ. అబ్దుల్ రషీద్ (33), ఎస్. ముర్తాష్ (37), వి. సగీత్ (40), ఉమైయార్ (22) ముంబై నివాసితులు అని పోలీసులు తెలిపారు. రాణిపేట ఎస్పీ అయ్మాన్ జమాల్‌కు అందిన సమాచారం మేరకు, జిల్లాలోని రైల్వే స్టేషన్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించడానికి ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. దీని ప్రకారం, ప్రత్యేక పోలీసు బృందం అరక్కోణం రైల్వే స్టేషన్‌లో ముంబైచెన్నై సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను తనిఖీ చేసి, మస్తాన్ కుర్షిద్ అహ్మద్ మరియు అబ్దుల్ రషీద్ అనే ఇద్దరు వ్యక్తుల నుండి మాత్రలను స్వాధీనం చేసుకుంది. వారి నుండి వచ్చిన సమాచారం ఆధారంగా, ముఠాలోని మిగిలిన సభ్యులను పోలీసులు అరెస్టు చేశారు. ముంబైలోని ఫార్మసీల నుండి నిషేధిత మాత్రలను తక్కువ ధరకు తీసుకువచ్చి తమిళనాడులో ఎక్కువ ధరలకు విక్రయించినట్లు పోలీసులు తెలిపారు. అరక్కోణం రైల్వే స్టేషన్‌లో వారిని పట్టుకునే ముందు నేరంలో పాల్గొన్న అనుమానితుల మొబైల్ ఫోన్ నంబర్లను పోలీసులు ట్రాక్ చేస్తున్నారు. అరెస్టు చేసిన వ్యక్తులను వెల్లూరులోని సెంట్రల్ జైలులో ఉంచారు. కేసు నమోదు చేసి తదుపరి దర్యాప్తు జరుగుతోంది.

## ప్రపంచ ప్రతిభావంతులకు చైనా కీలక సందేశం



'అమెరికా ఫస్ట్' నినాదంతో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ ప్రతిభకి తలుపులు మూసేస్తుంటే.. చైనా మాత్రం స్వాగతిస్తోంది. సాంకేతిక, ఆర్థిక పురోగతిని ముందుకు తీసుకెళ్లడానికి ప్రపంచవ్యాప్తంగా వివిధ రంగాల్లో ప్రతిభ ఉన్నవారికి చైనా తన దేశ ద్వారాలు తెరిచింది. నేటి ప్రపంచీకరణ ప్రపంచంలో సరిహద్దుల మధ్య ప్రతిభ మార్పిడి ఎంతో కీలకమని చైనా విదేశాంగ మంత్రిత్వశాఖ ప్రతినిధి గువో జియాకున్ నొక్కి చెప్పారు. అంతర్జాతీయ నిపుణుల ఆవిష్కరణలకు, కెరీర్ అవకాశాలను పెంపొందించడంలో చైనా తన నిబద్ధతను చాటుకుంటుందని ఆయన విశ్వాసం వ్యక్తం చేశారు. సోమవారం జరిగిన మీడియా సమావేశంలో గువో జియాకున్ మాట్లాడుతూ.. 'ప్రపంచీకరణ ప్రపంచంలో సరిహద్దుల మధ్య ప్రతిభ ప్రవాహం ప్రపంచ సాంకేతిక, ఆర్థిక పురోగతికి కీలకం. మానవాళి పురోగతి.. కెరీర్ విజయం కోసం ప్రపంచవ్యాప్తంగా ఉన్న వివిధ రంగాలకు చెందిన ప్రతిభా వంతులు వచ్చి తమ వృత్తి నైపుణ్యాలను కొనసాగించడానికి చైనా స్వాగతిస్తుంది' అని గువో జియాకున్ అన్నారు. ఇప్పటికే యువతను ఆకర్షించడానికి చైనా కె. వీసాను ప్రవేశపెట్టింది. కాగా, ఇటీవల ట్రంప్ హెచ్ 1బి వీసా దరఖాస్తు వార్షిక రుసుమును లక్ష డాలర్లకు పెంచడంతో యువత ఉపాధిపై తీవ్ర ప్రభావం పడిరది. విదేశీయులు అమెరికాకు వెళ్లి ఉద్యోగం చేయాలంటేనే బెంబెలెత్తిపోయే పరిస్థితి ఏర్పడిరది.

## కేరళను ఒక నమూనాగా మార్చాలి




ఎల్‌డిఎఫ్ ప్రభుత్వ నాయకత్వంలో కేరళలో అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ కార్యకలాపాలను దేశానికే ఒక నమూనాగా మార్చాలని సిపిఐ 25వ జాతీయ మహాసభ పిలుపునిచ్చింది. మహాసభలో భాగంగా మంగళవారం జరిగిన బహిరంగ చర్చలో వివిధ రాష్ట్రాల ప్రతినిధులు కేరళలోని వివిధ సంక్షేమ పథకాలను ప్రశంసించారు. కేరళను తీవ్ర పేదరికం లేని రాష్ట్రంగా మార్చడం, ఓనం పండుగ సమయంలో అద్భుతంగా పనిచేసిన ఆ రాష్ట్ర ప్రజా పంపిణీ వ్యవస్థను పుదుచ్చేరి ప్రతినిధులు ప్రత్యేకంగా ప్రశంసించారు. రాజకీయ తీర్మానం, నిర్మాణ, సమీక్ష నివేదికలపై చర్చ మంగళవారం పూర్తి అయింది. బుధవారం ప్రతినిధులు మూడు కమిషన్‌లుగా విభజించి చర్చించనున్నారు. చర్చలో చేసిన సూచనలతో సహా ముసాయిదా రాజకీయ నివేదికకు సవరణలు చేయబడతాయి. జాతీయ కమిటి, కార్యనిర్వాహక, ప్రధాన కార్యదర్శి, సెక్రటేరియట్ ఎన్నిక తరువాత మహాసభ గురువారం ముగుస్తుంది. సిపిఐ జాతీయ కార్యనిర్వాహక సభ్యుడు, రాజ్యసభ ఎంపి పి. సంతోష్ కుమార్ మంగళవారం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ బలంగా ఉన్న రాష్ట్రాల్లో ప్రతిపక్ష ఇండియా బ్లాక్ పురోగతి సాధించడం లేదని అన్నారు. అయితే సమిష్టివాదాన్ని సమర్థించే రాజకీయాలు విఫలమవుతున్నాయని దీని అర్థం కాదని అన్నారు. ఇండియా బ్లాక్ అనేది బిజెపి వ్యతిరేక ఫ్రంట్‌కు ప్రస్తుత పేరని అన్నారు. ఆ సమిష్టిని వదిలివేయడం లేదా సిపిఐ ఒంటరిగా పోటీ చేయడమనేది పరిశీలనలో ఉన్న అంశం కాదని అన్నారు. మన సమాజంలోని అధిక శాతం విశ్వాసులను తప్పుదారి పట్టించే కొన్ని ఉపాయాలు బిజెపికి ఉన్నందున అది కొంతవరకు ముందుకు సాగగలిగిందని విమర్శించారు. దానికి అనుగుణంగానే కేరళ సమాజంలో కూడా కొన్ని జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిని సమర్థవంతంగా ఎదుర్కొంటామని అన్నారు. దేశంలో వామపక్షాలు కేరళ నమూనాతో గుర్తింపు పొందాయన్నారు. ఆ నమూనా అన్ని రాష్ట్రాలలో ప్రచారం చేస్తామని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి దేశ రాజకీయాల్లో ఆర్‌ఎస్‌ఎస్ ప్రోత్సహించే మతతత్వాన్ని, అదే విధంగా మతతత్వాన్ని ప్రోత్సహించే వారిని సమాన శక్తితో వ్యతిరేకించే నాయకుడని పేర్కొన్నారు. ఆయన లౌకిక వైఖరిపై తమకు ఎటువంటి సందేహం లేదని, అలాంటి సందేహానికి ఎటువంటి సంబంధం లేదని వివరించారు. వివిధ దశలలో రాజకీయంగా సరైనదిగా అనిపించే అభిప్రాయాలను ఆయన వ్యక్తం చేశారని అన్నారు.

## కొల్‌కతాలో కుంభవృష్టి - 10 మంది మృతి



**కొల్‌కతా :** పశ్చిమబెంగాల్ రాజధాని కొల్‌కతాను భారీ వర్షాలు ముంచెత్తుతున్నాయి. అర్ధరాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షానికి నగరం అంతటా రోడ్లు, నివాస సముదాయాలు జలమయమయ్యాయి.దీంతో మంగళవారం నగరం అంతటా ట్రాఫిక్, ప్రజా రవాణా, రోజువారీ జీవితం స్తంభించిపోయింది. మరోవైపు భారీ వర్షాల కారణంగా 10 మంది మరణించారు. వీరంతా విద్యుత్‌షాక్‌తో మరణించడం మరింత విషాదం. అలాగే, నగరంలో 24 గంటల కంటే తక్కువ సమయంలో 251.4 మీమీ వర్షపాతం నమోదయింది. 1986 తరువాత (259.5 మీ.మీ) ఇదే అత్యధిక వర్షపాతం. గత 137 ఏళ్లలో ఇది ఆరో అత్యధిక వర్షపాతం. నగరంలోని దక్షిణ, తూర్పు ప్రాంతాలలో వర్ష ప్రభావం ఎక్కువగా ఉందని, గరియా కామదహరిలో కొన్ని గంటల్లోనే 332 మీ.మీ వర్షపాతం, జోధ్‌పూర్ పార్క్‌లో 285 మీ.మీ వర్షపాతం నమోదైందని కొల్‌కతా మున్సిపల్ కార్పొరేషన్ (కెఎంసి) తెలిపింది. అలాగే, కాలిఘాట్‌లో 280 మీ.మీ, టాప్సియాలో 275 మీ.మీ, బల్లిగంజ్‌లో 264 మీ.మీ, ఉత్తర కోల్‌కతాలోని తంతానియాలో 195 మీ.మీ వర్షపాతం నమోదైందని తెలిపింది. తెల్లవారుజామున 2,30 గంటల నుంచి 5.30 గంటల మధ్యే ఎక్కువ వర్షపాతం నమోదయిందని పేర్కొంది. వర్షాల కారణంగా బుధ, గురువారాల్లో రాష్ట్రంలోని అన్ని విద్యా సంస్థలకు సెలవులు ప్రకటించారు. దీంతో దసరా సెలవులు రెండు రోజుల ముందే ప్రారంభమయ్యాయి. ఈ నెల 26 నుంచి దసరా సెలవులను ఇప్పటికే ప్రకటించారు. రైల్వే ట్రాక్‌లు పూర్తిగా నీటితో నిండిపోవడంతో మెట్రో సర్వీస్‌తో పాటు, హౌరా, కొల్‌కతా టెర్మినల్ స్టేషన్లకు రైలు సేవలను నిలిపివేశారు. విమాన ప్రయాణం కూడా తీవ్రంగా ప్రభావితమైంది. కనీసం 30 విమానాలు రద్దు చేశారు. మరో 31 విమానాలు ఆలస్యంగా నడిచాయి. కాగా, సోమవారం ఈశాన్య బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం కారణంగా రాష్ట్రంలోని అనేక జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ శాఖ హెచ్చరించింది. ఈ నెల 25 నాటికి ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని తెలిపింది.

## అమెరికాలో ఫ్రాన్స్ అధ్యక్షునికి చేదు అనుభవం


ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యు యేల్ మేక్రాన్ చేదు అనుభవం ఎదురైంది. ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశాల్లో పాల్గొనేందుకు మేక్రాన్ అమెరికాకు వచ్చారు. న్యూయార్క్‌లోని ఐరాస ప్రధాన కార్యాలయంలో జరిగిన సమావేశంలో పాల్గొని రాత్రి బసచేసేందుకు ఫ్రాన్స్ రాయబార కార్యాలయానికి బయల్దేరారు. ఇలా తన సొంత కాన్వాయ్‌లో వెళ్తున్నప్పుడు న్యూయార్క్ నగర పోలీసులు ఈ కాన్వాయ్‌ను అడ్డుకుంది. ఇదే మార్గంలో ట్రంప్ కాన్వాయ్ వెళ్లబోతోందని, అది వెళ్లేదాకా పక్కకు ఆగి వేచి ఉండాలని వాహన శ్రేణి డ్రైవర్లను న్యూయార్క్ సిటీ పోలీసులు ఆదేశించారు. అయితే చాలా సేపు వేచిచూసిన మేక్రాన్ ఎంతకీ ట్రాఫిక్ ముందుకు కదలకపోవడంతో విసిగెత్తి కారు నుంచి కిందకు దిగి ఎదురుగా ఉన్న పోలీసుల వద్ద విషయం ఆరాతీశారు. వాళ్లు తాపీగా అసలు విషయం చెప్పారు. వెంటనే ట్రంప్ కు ఎమ్మాన్యు యేల్ మేక్రాన్ ఫోన్ చేశారు. ఎలా ఉన్నారు? ఇక్కడ ఏం జరిగిందో ఊహించగలరా? మీ కాన్వాయ్ వెళ్తోందని రోడ్లపై కార్లను ఆపేశారు. దీంతో నేను నడిరోడ్డుపై ఆగిపోయా. మీ కాన్వాయ్ వెళ్లిన తర్వాత ఎంబసీకి వెళ్దామని వేచిచూస్తున్నా'' అని మేక్రాన్ మాట్లాడారని పలు మీడియా కథనాలు వెలువరించాయి.



## భారత్‌తో సంబంధాలు చాలా ముఖ్యం

భారత్ అమెరికాకు చాలా ముఖ్యమైనదని అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో తెలిపారు. న్యూయార్క్ ప్యాలెస్‌లో 80వ ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం సందర్భంగా భారత విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్‌ను కలిసిన రూబియో పైవిధంగా వ్యాఖ్యానించారు. వాణిజ్యం, రక్షణ శక్తితో సహా అనేక ద్వైపాక్షిక అంశాలపై చర్చించినట్టు ఆయన తెలిపారు. ఓవైపు భారత దిగుమతులపై అమెరికా భారీ సుంకాలు విధిస్తున్న నేపథ్యంలో ఇరువురి విదేశాంగ మంత్రుల భేటీ ప్రాధాన్యాన్ని సంతరించుకుంది.దాదాపు గంట సేపు జరిగిన ఈ సమావేశం వాణిజ్యం, రక్షణ, ఇంధనం, ఔషధాలు వంటి ఖనిజాలు, ద్వైపాక్షిక అంశాలపై కీలక చర్చలు జరిపామని రూబియో తెలిపారు. ఈ సందర్భంగా యూఎన్‌జీఏలో భారత విదేశాంగ మంత్రి జైశంకర్‌తో సమావేశమయ్యానని మార్కో రూబియో ఎక్స్‌లో పోస్టు చేశారు. భారత్‌తో సంబంధాలు యూఎస్‌కు కీలకమని రూబియో పేర్కొన్నారని ఆ దేశ విదేశాంగ శాఖ ఓ ప్రకటనలో తెలిసింది. క్వాడ్‌తో సహా ఇండో పసిఫిక్ ప్రాంతాలను ప్రోత్సహించేందుకు అమెరికా భారత్ కలిసి పనిచేసేందుకు రూబియో, జైశంకర్‌లు అంగీకరించారని పేర్కొంది. అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియోతో భేటీ కావడం తనకు చాలా ఆనందంగా ఉందంటూ జైశంకర్ ఎక్స్‌లో పోస్టు పెట్టారు. ఈ సందర్భంగా అనేక అంతర్జాతీయ, ద్వైపాక్షిక అంశాలపై తమ మధ్య సంభాషణలు జరిగినట్టు తెలిపారు. ప్రాధాన్య రంగాల్లో పురోగతి సాధించేందుకు నిరంతరం సంప్రదింపులు కొనసాగించాలని తాము నిర్ణయించుకున్నామని వెల్లడిరచారు. ఈ సందర్భంగా 2025 అక్టోబర్‌నవంబర్ నాటికి ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం మొదటి దశను ముగించాలని రెండు దేశాలు అభిప్రాయపడ్డాయి. ఈ ఒప్పందం 2030 నాటికి ద్వైపాక్షిక వాణిజ్యాన్ని ప్రస్తుత యూఎస్ 191 బిలియన్ల నుంచి యూఎస్ 500 బిలియన్లకు రెట్టింపు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నాయి. కాగా మార్కో రూబియో, జైశంకర్ చివరిసారిగా జులైలో వాషింగ్టన్ డీసీలో జరిగిన క్వాడ్ సదస్సులో పాల్గొన్నారు. విదేశాంగ మంత్రుల సమావేశం సందర్భంగా ఇరుదేశాల మంత్రులు ద్వైపాక్షిక చర్చలు జరిపారు.

## శాంతి, సహకారాలకే పెద్ద పీట



శాంతి, సహకారాలకు ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగాలని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యదర్శి ఆంటానియో గుటెరస్ పిలుపిచ్చారు. చరిత్రలో నిర్ణయాత్మక పరిస్థితులు తలెత్తినపుడు స్పష్టమైన నిర్ణయాలు తీసుకోవాల్సి వుంటుందని ఆయన నేతలను కోరారు. మంగళవారం యూఎన్‌జీఏ 80 వార్షిక సమావేశాలను ప్రారంభిస్తూ ఆయన ప్రసంగించారు. గందరగోళ పరిస్థితుల సమయంలో సహకారం, అరాచకం నెలకొన్నపుడు చట్టం, ఘర్షణలపుడు శాంతికి ప్రాధాన్యతనివ్వాలని భావిస్తూ వ్యవస్థాపక సూత్రాలుగా వాటిని పేర్కొంటూ 80ఏండ్ల నాడు ఐక్యరాజ్య సమితి ఏర్పడిన విషయాన్ని గుర్తు చేశారు. ఆనాటి నిబద్ధతకు 'హృదయ స్పందన'వంటిది ఈనాటి అసెంబ్లీ అని ఆయన వ్యాఖ్యానించారు. నైతికతకు దిక్సూచి,అంతర్జాతీయ చట్టాలకు సంరక్షకురాలు, సుస్థిర అభివృద్ధికి ఉత్ప్రేరకం వంటిది ఐక్యరాజ్య సమితి అని నేతలకు గుర్తు చేశారు. ఎనిమిది దశాబ్దాలు గడిచిపోయాయి, కానీ మనందరం కలిసి నిర్మించుకోవడానికి ఎటువంటి ప్రపంచాన్ని ఎంచుకుందాం? అని ఆయన ప్రశ్నించారు. సరైన ఎంపికలు, నిర్ణయాలు తీసుకుంటే సరిపోదని, వాటిని ఆచరణలో పెట్టడానికి నేతలు ధైర్య సాహసాలు కూడగట్టుకోవాలని ఆయన స్పష్టం చేశారు. అనంతరం జనరల్ అసెంబ్లీ సమా వేశాల్లో సాధారణ చర్చ ప్రారంభమైంది. పలు దేశాల అధ్యక్షులు ప్రసంగించనున్నారు. సాంప్రదాయానుసారం తొలుత బ్రెజిల్ అధ్యక్షుడు ప్రసంగించారు మొత్తం గా ప్రపంచనేతలు పెద్ద సంఖ్యలో కొలువుదీరి వుండడంతో ఐక్యరాజ్య సమితి క్యాంపస్ లోపల, బయటా భద్రతను కట్టుదిట్టం చేశారు.

తెలంగాణ TELANGANA MUCHATLU ముచ్చట్లు
ఎడిటర్ : బొల్లెపాక రాజేష్
తెలుగు దిన పత్రిక

# ‘సొగసు చూడతరమా..’



సిద్ధు జొన్నలగడ్డ నటిస్తున్న మ్యూజికల్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ‘తెలుసు కదా’. ఈ సినిమా నుంచి ఇటీవల విడుదలైన ఫస్ట్ సింగిల్ ‘మల్లికా గంధ’ చార్ట్‌బస్టర్‌గా నిలిచింది. ఇది సిద్ధూ, రాశీ ఖన్నా అలరించిన క్లాసిక్ లవ్ నెంబర్. కాగా, సిద్ధు, శ్రీనిధి శెట్టి నటించిన సెకండ్ సింగిల్ ‘సొగసు చూడతరమా..’ను హీరోయిన్ నయనతార మంగళవారం లాంచ్ చేశారు. స్టైలిస్ట్ నీరజ కోన ఈ చిత్రంతో డైరెక్టర్ గా పరిచయం అవుతున్నారు. పీపుల్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై టీజీ విశ్వ ప్రసాద్, కృతి ప్రసాద్ నిర్మించిన ఈ చిత్రానికి తమన్ సంగీతం అందించారు. సాయంత్రం ముగిసే సమయానికి సిద్ధూ బయలుదేరడానికి సిద్ధమవు తుండగా, శ్రీనిధి తన వాచ్ సమయాన్ని రీసెట్ చేస్తుంది, ఆమె ఇంకా వీడ్కోలు చెప్పడానికి సిద్ధంగా లేదని చూపించే సైన్ ఇది. ఈ ట్రాక్‌తో తమన్ మరో అద్భుతమైన కంపోజిషన్ అందించాడు. బాస్‌లైన్, డ్రమ్‌బీట్, ట్రంపెట్ పాటకు రెట్రో వైబ్‌ను ఇచ్చింది. కార్తీక్ వోకల్స్ పాటకు డెప్త్, ఎమోషన్‌ని యాడ్ చేసింది. కృష్ణ కాంత్ రాసిన లిరిక్స్ అమ్మాయి పట్ల సిద్ధు ఎమోషన్స్‌ని అందంగా ప్రజెంట్ చేస్తోంది. విజువల్స్ సాంగ్‌కు మరింత బ్యూటీని యాడ్ చేశాయి. సిద్ధు, శ్రీనిధి మధ్య కెమిస్ట్రీ అదిరిపోయింది. సిద్ధు స్టైలిష్ డ్యాన్స్ మూవ్స్ ఆకట్టుకుంటున్నాయి. వైరల్ ట్యూన్, అద్భుతమైన విజువల్స్‌తో ఈ పాట నేరుగా మ్యూజిక్ చార్ట్‌లలో టాప్‌లోకి వెళ్ళింది. ఇటీవల విడుదలైన టీజర్‌కు అద్భుతమైన స్పందన వచ్చింది. పాటలు చార్ట్ బస్టర్ హిట్స్ కావడంతో సినిమాపై అంచనాలు మరింతగా పెరుగుతున్నాయి.

# సుజిత్ నమ్మకం ఖరీదు వందల కోట్లు



దశాబ్దంపైగానే అనుభవమున్నా ఇప్పటి దాకా కేవలం మూడు సినిమాలతో క్రేజ్ సంపాదించడం ఒక్క దర్శకుడు సుజిత్ కు మాత్రమే దక్కిన అదృష్టం. రన్ రాజా రన్ ఎంత సూపర్ హిట్ అయినా అదేమీ ప్యాన్ ఇండియా స్థాయిలో రీచ్ కాలేదు. అయినా సరే యువి క్రియేషన్స్, ప్రభాస్ జంటగా తనను నమ్మి సాహో అవకాశాన్ని ఇచ్చాయి. టెక్నికల్ గా ఋజువు చేసుకున్నా కమర్షియల్ గా దాని ఫలితం నిరాశ పరిచిన మాట వాస్తవం. ఆ తర్వాత ఏళ్ళ తరబడి ఎదురు చూపులకు దక్కిన వరంగా పవన్ కళ్యాణ్ గ్రీన్ సిగ్నల్ దొరికింది. చిరంజీవి గాడ్ ఫాదర్ ఆఫర్ వచ్చినా సుజిత్ వద్దనుకోవడానికి కారణం అది రీమేక్ కావడమే. ఇప్పుడు సుజిత్ జీవితంలోనే అతి ముఖ్యమైన దశ వచ్చింది. తన ట్రాక్ రికార్డుతో సంబంధం లేకుండా ఓజి మీద విపరీతమైన హైప్ వచ్చింది. దీనికి కారణం కేవలం పవన్ కళ్యాణ్ అని చెప్పలేం. ఎందుకంటే ఇంత హైప్ హరిహర వీరమల్లు, బ్రో, భీమ్లా నాయక్, వకీల్ సాబ్ కు రాలేదు. కానీ ఓజికి మాత్రమే ఎందుకు కనిపిస్తోందంటే సుజిత్ ఓజి అనే పేరుని బ్రాండ్ గా మార్చి దాని మీద సృష్టించిన నమ్మకం. గతంలో పవన్ పంజాలో గ్యాంగ్ స్టర్ గా నటించినప్పటికీ అంతకు మించిన ఇంటెన్స్ డ్రామా ఓజిలో చూపించబోతున్నాననే హామీ అనౌన్స్ మెంట్ పోస్టర్ నుంచి ఇస్తూనే వచ్చాడు. ఇక టీజర్ ఒక మినీ సునామిలాగా దూసుకుపోయింది. ఇక చివరి ఘట్టంలో అడుగుపెట్టబోతున్న సమయంలో అంచనాలు ఆకాశాన్ని దాటుతున్నాయి. సుజిత్ కు రాజమౌళి, త్రివిక్రమ్, సుకుమార్ లాగా వందల కోట్ల లాభాలు తెచ్చిపెట్టిన సినిమాలు లేవు. కేవలం ఒక హిట్టు ఒక ఫ్లాపు ఉన్నాయి.

## నా పాత్ర పవర్‌ఫుల్‌గా ఉంటుంది



పవర్ స్టార్ పవన్ కల్యాణ్ సుజిత్ దర్శకత్వంలో వస్తున్న ‘ఓజీ’సినిమా దసరా కానుకగా సెప్టెంబర్ 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది. ఇందులో బాలీవుడ్ హీరో ఇమ్రాన్ హష్మీ ప్రతినాయకుడిగా కనిపించారు. పవన్ కళ్యాణ్ సరసన ప్రియాంక మోహన్ హీరోయిన్‌గా నటించింది. ప్రకాష్ రాజ్, అర్జున్ దాస్, శ్రియా రెడ్డి, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషించారు. డీవీవీ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై డీవీవీ దానయ్య, కళ్యాణ్ దాసరి ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. తాజాగా, ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న శ్రియా రెడ్డి ‘ఓజీ’ చిత్రంపై ఆసక్తికర కామెంట్స్ చేసింది. ‘‘నా పాత్రలో భావోద్వేగాలతో పాటు శక్తి కలిసి చాలా పవర్ ఫుల్‌గా ఉంటుంది. ముఖ్యంగా ఈ సినిమాలో నేను మేకప్ వేసుకోకుండా నటించాను. రియలిస్టిక్‌గా కనిపించాలని కోరుకోవడంతో నేను కూడా అంగీకరించాను. పవన్ కళ్యాణ్ గారు షూటింగ్‌లో ఎక్కువగా మాట్లాడరు. రాజకీయ పనులు పక్కనపెట్టి వస్తారు కాబట్టి నేను కూడా ఆయనతో మాట్లాడాలని ఇబ్బంది పెట్టకుండా నా పని నేను చేసుకున్నాను. సెట్‌లో మేము సినిమాకి సంబంధించిన విషయాలు మాత్రమే చర్చించుకున్నాం. పవర్ స్టార్‌తో స్క్రీన్ షేర్ చేసుకోవడం మంచి అనుభవం చాలా సంతోషంగా ఉంది. తప్పకుండా ‘ఓజీ’ చిత్రాన్ని ఆదరిస్తారని ఆశిస్తున్నాను’’ అని చెప్పుకొచ్చింది. ప్రస్తుతం ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో వైరల్ అవుతుండగా.. అందరిలో ఆమె పాత్రపై క్యూరియాసిటీ పెరిగిపోయింది.

# 7 వేలకు పైగా థియేటర్లలో రిలీజ్



చాప్టర్ 1: సినిమా చిత్రీకరణ సమయంలో నేను నాలుగు సార్లు చనిపోయేవాడిని. ఆ దేవుడి ఆశీస్సులు ఉండటం వల్లే బతికాను. ఈ సినిమా కోసం ప్రతి ఒక్కరూ ప్రాణం పెట్టి పని చేశారు. తమ సొంత సినిమాలా భావించారు. అందుకే సినిమా అద్భుతంగా వచ్చింది’ అని ‘కాంతార: చాప్టర్ 1’ ట్రైలర్ ఆవిష్కరణ వేడుకలో హీరో రిషబ్ శెట్టి అన్నారు. ‘కాంతార’ సినిమాకి ప్రీక్వెల్‌గా రాబోతున్న ‘కాంతార: చాప్టర్ 1’ పై భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్ర ట్రైలర్‌ని తెలుగులో హీరో ప్రభాస్ లాంచ్ చేశారు. అలాగే ఇతర భాషల్లో ఆయా భాషల్లో స్టార్ హీరోలైన హృతిక్ రోషన్, పృథ్వి రాజ్ సుకుమారన్, శివ కార్తికేయన్ లాంచ్ చేశారు. విజువల్ వండర్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తూ ప్రేక్షకులను కాంతారా ప్రపంచంలోకి ట్రైలర్ తీసుకెళ్ళి, అనేక రికార్డులు సృష్టిస్తోంది. 24 గంటల వ్యవధిలో ఈ ట్రైలర్ అన్ని భాషల్లో కలిపి 107 మిలియన్ డిజిటల్ వ్యూస్‌తో పాటు 3.4 మిలియన్ లైక్స్ సాధించి సరికొత్త రికార్డ్ క్రియేట్ చేసింది. ఈ సినిమాలో రిషబ్ శెట్టి సరసన యువరాణి పాత్రలో రుక్మిణి వసంత్ కనిపించనుంది. గుల్షన్ దేవయ్య కీలక పాత్రలో నటిస్తున్న ఈ సినిమాను దర్శకుడిగా రిషబ్ శెట్టి ఒక దృశ్య కావ్యంలా తీర్చిదిద్దుతున్నారు. దసరా కానుకగా ఈ చిత్రం అక్టోబర్ 2న కన్నడతో పాటు హిందీ, తెలుగు, మలయాళం, తమిళం, బెంగాలీ, ఇంగ్లీష్ భాషల్లో ప్రపంచవ్యాప్తంగా దాదాపు 7 వేలకు పైగా స్క్రీన్స్‌లో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో కర్ణాటక పోస్టల్ సర్కిల్ భాగస్వామ్యంతో ‘కాంతార’థీమ్‌తో చిత్ర బృందం స్పెషల్ కవర్‌ను తీసుకొచ్చింది. ‘స్పిరిట్ ఆఫ్ కర్ణాటకలో భాగంగా భూతకోల నేపథ్యంలో రెండు పోస్టల్ కార్డులను అందుబాటులోకి తెచ్చాం. ఇది ఆధ్యాత్మికతను, జానపదాన్ని, సంస్కృతిని ఏకం చేస్తుంది. హోంబలే ఫిల్మ్స్ సహకారంతో కర్ణాటక పోస్ట్ సర్కిల్ ఈ కార్డులను విడుదల చేసింది. ‘కాంతార’ ద్వారా సాంస్కృతిక వారసత్వాన్ని ప్రపంచ ప్రేక్షకులకు తెలియజేస్తుంది. ఈ కథలన్నీ రాబోయే తరాలకు స్ఫూర్తినిస్తాయి’ అని ఇండియా పోస్ట్ తెలిపింది.



మలయాళ యంగ్ బ్యూటీ కళ్యాణి ప్రియదర్శన్ ఇటీవల ‘కొత్త లోకా’ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చింది. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నిర్మాణంలో వచ్చిన ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద సంచలనం సృష్టిస్తోంది. సూపర్ హిట్‌గా నిలవడంతో పాటు కళ్యాణి మొట్టమొదటి ఫీమేల్ సూపర్ హీరోగా పేరు దక్కించుకుంది. అలాగే భారీ కలెక్షన్లు రాబడుతూ థియేటర్స్‌లో సక్సెస్‌ఫుల్‌గా కొనసాగుతోంది. ఈక్రమంలో.. కళ్యాణి ప్రియదర్శన్ వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటూ పలు కామెంట్స్ చేస్తోంది. ఇక ఇటీవల ఆమె ‘‘ఎంతో ఆస్తి ఉన్నప్పటికీ జీవితం విలువ తెలియాలన్న ఉద్దేశ్యంతో మా తల్లిదండ్రులు తనను తన తమ్ముడిని చిన్నతనంలో వియత్నాంలోని ఓ అనాథాశ్రమంలో ఉంచారని.. అక్కడ అనాథ పిల్లలతో కలిసి ఉంటూ వాళ్లు తినే ఆహారమే తిన్నామని అనడం గమనార్హం. నేలపైనే పడుకున్నాం. ఆ అనుభవం జీవితం విలువ ఏంటో నేర్పించింది అని చెప్పుకొచ్చినట్లు తెలుస్తోంది. ఇక ఈ కామెంట్స్ సోషల్ మీడియాలో ఫుల్ వైరల్ అవుతున్నాయి. ఈ విషయం కాస్త కళ్యాణి ప్రియదర్శన్ కంట పడటంతో ఈ అమ్మడు స్పందించి ట్విస్ట్ ఇచ్చింది. ఈ విషయంపై క్లారిటీ ఇస్తూ కీలక విజ్ఞప్తి చేసింది. ‘‘ఈ మాట నేనెప్పుడూ అనలేదు. దయచేసి ఇలాంటి అసత్య ప్రచారాలు చేయడం ఆపండి. అసలు నేను అన్నానా లేదా? అనే విషయం తెలుసుకోకుండా తప్పుడు వార్తలు సృష్టిస్తున్నారు. ఇవన్నీ ఫేక్ నమ్మకండి. దయచేసి మీడియా వారు వార్తలు రాసేముందు నిజమా కాదా? అని ధృవీకరించుకోండి. ఈ తప్పుడు వార్తల వల్ల నా కుటుంబ సభ్యులు బాధపడుతున్నారు’’ అని చెప్పుకొచ్చింది.

## ఆ మాట నేనెప్పుడూ అనలేదు..

# కర్ణాటక ప్రభుత్వ నిర్ణయంపై స్టే



రూ.200లకే సినిమా టికెట్ ధరలు ఉండాలనే విషయంలో కర్ణాటక ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ‘కాంతార’ (హోంబలే ఫిలింస్) సినిమా నిర్మాతలు న్యాయస్థానాన్ని ఆశ్రయించారు. కర్ణాటక హైకోర్టు స్టే విధించింది. ఈ పిటీషన్ మంగళవారం విచారణకు రాగా తదుపరి విచారణ జరిపి తుది తీర్పు వచ్చేవరకూ టికెట్ ధరల పరిమితిని అమలు చేయకుండా మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని థియేటర్లు, మల్టీప్లెక్స్‌లలో సినిమా టికెట్ ధర గరిష్టంగా రూ.200గా మాత్రమే ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. అయితే ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ‘కాంతార’ సినిమా నిర్మాతలు కోర్టుకెక్కారు. ప్రభుత్వం నిర్ణయించిన కొత్త నిబంధనల వలన కాంతర వంటి పెద్ద బడ్జెట్ సినిమాలతో పాటు, మల్టీప్లెక్స్‌లలో అధిక ధరలు ఉండే సినిమాలను విడుదల చేయడం కష్టమవుతుందని దాని వల్ల ఆదాయం తగ్గి మొత్తం సినీ పరిశ్రమపై చెడు ప్రభావం పడుతుందని హోంబలే ఫిల్మ్స్ వాదించింది. ‘కాంతార: చాప్టర్ 1’ కాంతారకు ప్రీక్వెల్‌గా వస్తున్న ఈ సినిమా అక్టోబర్ రెండోతేదీన విడుదల కానుంది. కన్నడ నటుడు, దర్శకుడు రిషబ్‌శెట్టి స్వీయ దర్శకత్వంలో ఈ సినిమా తెరకెక్కింది. రుక్మిణి వసంత్ కథానాయిక. ‘నో స్మోకింగ్, నో ఆల్కహాల్, నో మీట్ అనే పోస్టర్‌ని చూసి నేను షాక్ అయ్యాను.

# మిరాయ్ టీం సంచలన నిర్ణయం




పవన్ కళ్యాణ్ అభిమానులకు శుభవార్త. ‘పవర్ స్టార్’ నటించిన ‘ఓజీ’ సినిమా విడుదల నేపథ్యంలో, తేజ సజ్జా నటించిన ‘మిరాయ్’ సినిమా నిర్మాణ బృందం ఒక కీలక నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతున్న ‘మిరాయ్’ సినిమాను గురువారం నాడు ప్రదర్శించకుండా, ఆ స్క్రీన్లను పవన్ కళ్యాణ్ ‘ఓజీ’ సినిమాకు కేటాయించారు. ఇది తెలుగు చలనచిత్ర పరిశ్రమలో ఆరోగ్యకరమైన పోటీకి ఉదాహరణగా నిలుస్తోంది. సెప్టెంబర్ 12న విడుదలైన ‘మిరాయ్’, ఇప్పటికీ అనేక థియేటర్లలో హౌస్‌ఫుల్ కలెక్షన్లతో దూసుకుపోతోంది. ఈ సినిమా ఇప్పటికే రూ. 150 కోట్ల మార్క్‌ను దాటే దిశగా సాగుతోంది. పవన్ కళ్యాణ్ ‘ఓజీ’ విడుదల రోజు అయిన గురువారం నాడు, తమ సినిమాను ప్రదర్శించకుండా అన్ని థియేటర్ల స్క్రీన్లను ‘ఓజీ’ సినిమాకు కేటాయించాలని ‘మిరాయ్’ టీం నిర్ణయించుకుంది. శుక్రవారం నుంచి యథావిధిగా ‘మిరాయ్’ ప్రదర్శనలు కొనసాగుతాయి. పవన్ కళ్యాణ్ మీద గౌరవంతో తీసుకున్న ఈ నిర్ణయంపై ‘మిరాయ్’ టీంకు సినీ వర్గాల నుంచి, ప్రేక్షకుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. సాధారణంగా, పెద్ద సినిమాలు విడుదలైనప్పుడు చిన్న సినిమాల ప్రదర్శనలు నిలిచిపోవడం సహజం. కానీ, మంచి వసూళ్లు సాధిస్తున్న ఒక సినిమా స్వచ్ఛందంగా మరో సినిమా కోసం వైదొలగడం ఒక అరుదైన, ప్రశంసనీయమైన చర్య. ఇది సినిమా పరిశ్రమలో మంచి వాతావరణాన్ని ప్రోత్సహిస్తుందని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ‘మిరాయ్’ సినిమా విజయవంతంగా నడుస్తున్న ఈ సమయంలో, ప్రేక్షకులను మరింత ఆకట్టుకోవడానికి ఇటీవలే ‘వైబ్ ఉంది’ అనే పాటను కూడా సినిమాలో జతచేశారు. ఈ కొత్త పాటతో సినిమాకు మరింత బలం చేకూరిందని చెప్పవచ్చు.

Printed Published and Owned by RAJESH BOLLEPAKA Printed at Amulya Publications and Printers Graphics.H.No:2-19/1 Thatikayala Dharmasagar, Hanmakonda.506151 and Published at H.No:2-19/1, Thatikayala, Dharmasagar, Hanmakonda 506151 Editor:BOLLEPAKA RAJESH.RNI:TELTEL/2023/88710. Contact:9493669669 Email:telanganamuchatlu.in@gmail.com.Website:www.telanganamuchatlu.in